
Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 11.07.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 06 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# నిదానమా? నిర్లక్ష్యమా?



- ఇంకా దారిన పడని బాబు పాలన
- పరిష్కారం కాని బాలారిష్టాలు
- రాజధానిపై ఇంకా సస్పెన్స్
- నెలరోజుల్లోనే బాబు తీరుపై అసంతృప్తి

***కేసీఆర్ మొదటిసారి ముఖ్యమంత్రి అయ్యాడు. కాని అతని దూకుడు, అతని నిర్ణయాలు చూస్తుంటే తొలిసారి సీఎం అయినట్లుగా లేదు. సీఎంగా ఎంతో అనుభవమున్న వాడిలా దూసుకుపోతున్నాడు. మరి ఆంధ్రా సీఎం చంద్రబాబును చూస్తే ముఖ్యమంత్రిగా పదేళ్ల అనుభవం ఉంది. కాని ఆయన పనితీరు చూస్తుంటే కొత్తగా సీఎం అయినట్లుంది. కేసీఆర్ వేగాన్ని చంద్రబాబు ఏ మాత్రం అందుకోలేకపోతున్నారు. నిన్నటిదాకా ఒకటిగా వున్న రాష్ట్రానికి విడిపోయిన తర్వాత వీరిద్దరూ సీఎంలయ్యారు. అయితే పనితీరులో మాత్రం ఇద్దరి మధ్య చెప్పలేనంత తేడా కనిపిస్తోంది.***

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు అన్నీ సమకూరాయి. వాళ్లది వడ్డించిన విస్తరి పరిస్థితి. అయినా తెలంగాణకు ఇంకా ఏదో సాధించిపెట్టాలనే తపనతో కేసీఆర్, ఆయన మంత్రివర్గ సభ్యులు పనిచేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు సైతం తెలంగాణకే వచ్చేలా పారిశ్రామిక విధానాలను రూపొందిస్తున్నారు.

వాళ్లు అంత వేగంగా ఉంటే సీఎంగా ప్రమాణస్వీకారం చేసి నెలరోజులు దాటినా చంద్రబాబు ఇంకా కుర్చీలు, బల్లలు వెదుక్కునే పనిలోనే ఉన్నాడు. అసలు సీమాంధ్ర రాష్ట్రంలో పరిపాలన ఉందా లేదా అన్నట్లుగా పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర విభజనతో సీమాంధ్ర చాలా నష్టపోయింది. ఇది కోలుకోవాలంటే కొత్త ప్రభుత్వం చాలా వేగవంతంగా, శక్తివంతంగా పనిచేయాలి. ఒకప్పుడు తెలంగాణ మన రాష్ట్రంలో భాగం. ఇప్పుడు అభివృద్ధి ప్రక్రియలో తెలంగాణే మనకు పోటీ అవుతోంది. కాబట్టి ప్రభుత్వం చురుకుగా, చొరవగా స్పందిస్తుంటేనే అభివృద్ధి ముందుకు కదులుతుంది. చంద్రబాబులో చూస్తే వేగం బదులు మందకొడితనం ఎక్కువగా కనిపిస్తోంది. ఆయన వాలకం చూస్తే నిదానమే ప్రదానం అన్నట్లుగా వుంది. కాని నెలరోజుల్లో ఆయన సాధించింది, చేసింది ఏమీ లేదని ప్రజలు అప్పుడే పెదవి విరుస్తున్నారు. చంద్రబాబు ఇంకా హైదరాబాద్‌ను వదిలి రాకపోవడం, భౌగోళికంగా తెలంగాణ మన నుండి విడిపోవడంతో చంద్రబాబు కూడా సీమాంధ్రకు దూరంగా వున్నట్లే అనిపిస్తోంది. మన రాష్ట్రంలో ప్రభుత్వం లేదు, పాలన లేదనే అభిప్రాయం ఏర్పడుతోంది. ముఖ్యమంత్రేం చేస్తున్నారో, మంత్రులేం చేస్తున్నారో కూడా మనకు కనిపించడం లేదు. ప్రమాణస్వీకారం చేసినరోజు చంద్రబాబు సంతకాలు చేసిన హామీలు కూడా ఇంత వరకు ఆచరణ రూపం దాల్చలేదు.

ముఖ్యంగా సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే విజయవాడలో క్యాంప్ ఆఫీసు పెట్టుకుంటానని చంద్రబాబు చెప్పిన మాటలు కూడా కార్యరూపం దాల్చడం లేదు. హైదరాబాద్‌లో తనకు కేటాయించిన క్యాంపు కార్యాలయాల (మిగతా 10వ పేజీలో)




## ఉత్కంఠలో జడ్పీ పీఠం...

# ఎవరు గెలుస్తారో?





***నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ పీఠం ఇప్పుడు ఎవరికి దక్కుతుందనేదానిపై ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల్లో గెలిచిన జడ్పీటీసీల సంఖ్య ప్రకారం తీసుకుంటే ఈ కుర్చీ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీదే! అందులో సందేహం లేదు. వైకాపాకు 31 జడ్పీటీసీలు వస్తే తెలుగుదేశంకు అందులో సగం కంటే తక్కువుగా 15జడ్పీటీసీలు మాత్రమే వచ్చాయి.***

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో పరిస్థితి తలక్రిందులైంది. జడ్పీటీసీల లెక్కలు తారుమారవుతున్నాయి. ఈ నెల 5న తలపెట్టిన జడ్పీ ఛైర్మెన్ ఎన్నిక రసాభసా కావడంతో ఈ నెల 13కు వాయిదా పడింది. 5వ తేదీ నాటికే ఆరు మంది వైకాపా జడ్పీటీసీలు తెలుగుదేశంలో చేరిపోయారు. ఆరోజుకు వైకాపా బలం 25గా ఉంటే తెలుగుదేశంకు 21మందే ఉన్నారు. దాంతో తెలుగుదేశం నాయకులు వ్యూహాత్మకంగా గొడవ సృష్టించి ఎన్నిక వాయిదా పడేలా చేసారు. ఆ గొడవలోనే మనుబోలు జడ్పీటీసీ తిరివీధి రమేష్‌ను తమ క్యాంపులోకి లాగేసుకున్నారు. అయినా ఇప్పుడు (మిగతా 10వ పేజీలో)



# బజ్జున్నావా... బుజ్జికన్నా!

## తే..తే... తేతేతే... నా రాజా!

***మనిషి సగటున 75ఏళ్లు జీవించాడనుకుందాం. ఇందులో 25ఏళ్లకాలం ఖచ్చితంగా నిద్రపోయి ఉంటాడు. రోజుకు 24గంటల్లో మనం 8గంటలు విశ్రాంతిలో వుంటాం. మిగతా 16గంటలు పనుల్లో, ఇతర వ్యాపకాల్లో ఉంటాం. భగవంతుడే మనం విశ్రాంతి కోసం రోజులో కొంత సమయాన్ని కేటాయించాడు. అయితే పని చేయాల్సిన సమయాన్ని నిద్రకు కేటాయిస్తే ఇక మానవ జన్మకు అర్థమే ఉండదు.***

పనీపాటా లేని సోమరిపోతులు ఎప్పుడు నిద్రపోయినా, ఎప్పుడు మేల్కొన్నా పెద్ద తేడా ఉండదు. కాని కీలకమైన బాధ్యతలు నిర్వహించే వ్యక్తులు సమయం కాని సమయంలో నిద్రపోతే మాత్రం సమస్యలు వస్తాయి.

కాంగ్రెస్ యువరాజు, ఈ దేశానికి ప్రధాని కావాలని కలలు కన్న యువనేత రాహుల్‌గాంధీ ఈ నెల 9వ తేదీన లోక్‌సభలో నిద్రపోవడం పెద్ద చర్చనీయాంశమైంది. కీలకమైన ఆర్థిక బిల్లులు, ధరలపై అధికార, విపక్షాల మధ్య వాడివేడిగా చర్చ జరుగుతున్న సమయంలో రాహుల్ బెంచీ మీద పడుకుని నిద్రపోవడం మీడియా కంట, తోటి సభ్యుల కంట పడింది. దీంతో బీజేపీ సభ్యులతో పాటు మీడియా కూడా రాహుల్ నిద్రపై దుమ్మెత్తి పోసింది. రాహుల్‌కు నాయకత్వ లక్షణాలు లేవని సొంతపార్టీ నాయకులే ఈ మధ్య విమర్శలు మొదలుపెట్టారు. ప్రధాని ఎలాగూ కాలేకపోయాడు. ప్రతిపక్ష నేత బాధ్యతలు కూడా (మిగతా 10వ పేజీలో)






జుగుప్సాకరంగా జడ్పీ సంఘటన

# రాజకీయమా? రాక్షసత్వమా?

**రాజకీయాలు రోతగా ఉంటాయని తెలుసు. మరీ ఇంత రోతగా ఉంటాయను కోలేదు. రాజకీయ నాయకులు రాటుదేలి ఉంటారని తెలుసు. మరీ ఇంత రాక్షసత్వంగా ఉంటారనుకోలేదు. అధికారం అనే మత్తులో పడితే రాజకీయ నాయకులు తాము మనుషులమన్న సంగతి మరచిపోయేటట్లున్నారు. ఎంతకైనా బరితెగించేటట్లున్నారు. రాజకీయాలన్నా, రాజకీయ నాయకులన్నా అసహ్యం పుట్టే సంఘటనకు వేదికగా నిలిచింది నెల్లూరుజిల్లాపరిషత్ కార్యాలయం.**

ఈ నెల 5న నెల్లూరుజిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ ఛైర్మెన్ ఎన్నిక ప్రక్రియ ఒక యుద్ధకాండనే తలపించింది. తెలుగుదేశం, వైకాపా సభ్యుల భీభత్సం వల్ల ఈ నెల 13కు వాయిదా పడింది. ఆరోజు జడ్పీలో జరిగిన సంఘటనలతో సభ్య సమాజమే తలదించుకోవాల్సి వచ్చింది.

ఇటీవల జరిగిన పంచాయితీరాజ్ ఎన్నికల్లో వైకాపాకు 31జడ్పీటీసీలు రాగా, తెలుగుదేశంకు 15జడ్పీటీసీలు వచ్చాయి. అయితే కోర్టు అసెంబ్లీ ఎన్నికల తర్వాతే జడ్పీ ఫలితాలను ప్రకటించాలని ఆదేశించింది. జిల్లాలో వైకాపాకు పూర్తి మెజార్టీ వచ్చింది. కాని రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో తెలుగు దేశం నాయకులు ఎలాగైనా జడ్పీ పీఠాన్ని కొట్టేయాలనుకున్నారు. అధికారబలాన్ని ప్రయోగించి వైకాపా నుండి ఆరు మంది జడ్పీటీసీలను లాగేయగలిగారు. దీంతో తెలుగుదేశం బలం 21కి చేరగా వైకాపా బలం 25కి పడిపోయింది. అయినా కూడా వైకాపానే జడ్పీ ఛైర్మెన్ పీఠాన్ని గెలిచే పరిస్థితి నెలకొంది. ఈ నెల5న జడ్పీ ఛైర్మెన్ ఎన్నికకు జడ్పీ హాల్‌లో ఏర్పాట్లు చేసారు. జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ ఎన్నికల అధికారిగా వ్యవహరించసాగారు. ఉదయం 10గంటలకు కో-ఆప్షన్ సభ్యుల నామినేషన్ ప్రక్రియ మొదలైంది. ఒంటి గంటకు వైకాపా జడ్పీటీసీలు వచ్చారు. కోరం ఉండడం, టైం కావడంతో నిబంధనల ప్రకారం కలెక్టర్ సభ్యుల చేత ప్రమాణస్వీకారం మొదలు పెట్టించారు. ఆ సమయంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వచ్చారు. మా పార్టీ సభ్యులు రాకుండానే ప్రమాణస్వీకారం ఎలా చేయిస్తారంటూ కలెక్టర్‌పై చిందులేసారు. ఆయన ముందున్న మైకు లాగేసి, పత్రాలను చించేసారు. తర్వాత కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తెలుగుదేశం జడ్పీటీసీలు కూడా వచ్చి వాదనకు దిగారు. కొందరు వైకాపా నాయకులు తమ సభ్యులను బెదిరిస్తున్నారని, కాబట్టి సీక్రెట్ ఓటింగ్ నిర్వహించాలంటూ పట్టుబట్టారు. అనూహ్యంగా జరిగిన కురుగొండ్ల సంఘటనతో మనస్థాపం చెందిన కలెక్టర్ అక్కడ నుండి పక్కగదిలోకి వెళ్లిపోయారు. ఈలోపు తెలుగుదేశం ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు కలిసి బుచ్చి, కావలి జడ్పీటీసీలను తమవైపు లాక్కువెళ్లే ప్రయత్నం చేసారు. వైకాపా సభ్యులు ఈ ప్రయత్నాలను అడ్డు కోవడంతో సభలో తీవ్ర గందరగోళం రేగింది. కావలి జడ్పీటీసీ సభ్యురాలు ఈ గొడవతో సొమ్మసిల్లి పడిపోయింది. ఈ గందరగోళంలోనే మనుబోలు జడ్పీటీసీ సభ్యుడు తిరువీధి రమేష్‌ను తెలుగుదేశం వాళ్లు తమ శిబిరంలోకి లాగేసుకున్నారు. వైకాపా నాయకులు ఆరోజే ఎన్నికలు నిర్వహించాలనే ఉద్దేశ్యంతో గొడవల జోలికి పోకుండా జాగ్రత్తపడ్డారు. తెలుగుదేశం నాయకులు మాత్రం ఉద్రిక్తత ఏ మాత్రం తగ్గకుండా వ్యవహరించారు. దీంతో సాయంత్రం 6గంటల దాకా కూడా సమావేశంలో యుద్ధ వాతావరణమే ఉండడంతో కలెక్టర్ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో తెలుగుదేశం నాయకుల పన్నాగం ఫలించినట్లయ్యింది. మొత్తానికి అరుపులు, కేకలు, కొట్లాటలతో నెల్లూరు జడ్పీ పేరు మొతమోగింది.



డాక్టర్లకు...

# కలసిరాని నెల్లూరు



## మొన్న యశోధర... నేడు జడ్.యస్

***నెల్లూరు నగరపాలక సంస్థ డాక్టర్లకు కలిసిరావడం లేదు. పక్కా రాజకీయనాయకులు లేదంటే వ్యాపారులకే ఇది కలిసివస్తుంది. వైద్యులను మాత్రం ఆదరించడం లేదు. ఒకప్పుడు కాంగ్రెస్‌పార్టీని నమ్ముకుని, ఇప్పుడు తెలుగుదేశంపార్టీని నమ్ముకుని ఇద్దరు వైద్యులు దెబ్బతిన్నారు. కాంగ్రెస్‌ను నమ్ముకుని 2000లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో డాక్టర్ పల్లంరెడ్డి యశోధర దెబ్బతింటే, తెలుగుదేశాన్ని, ఆ పార్టీ నాయకులను నమ్ముకుని 2014 నగరపాలకసంస్థ ఎన్నికల్లో డాక్టర్ జడ్.శివప్రసాద్ నష్టపోయారు. సొంతపార్టీ నాయకుల సహకారం కొరవడడంతోనే వీళ్లు ఓటమిని చవిచూడాల్సి వచ్చింది.***

2000 మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా టి.అనూరాధ, కాంగ్రెస్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా డాక్టర్ పి.యశోధర రంగంలోకి దిగారు. నెల్లూరు మున్సిపాల్టీకి జరిగిన చివరి ప్రత్యక్ష ఎన్నికలివి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పి.యశోధరకు నెల్లూరులోని ఓ ప్రధానవర్గమే సహకరించలేదనే ప్రచారమొచ్చింది. దరిమిలా దాదాపు 10వేల ఓట్ల తేడాతో యశోధర ఓడిపోయింది.

మొన్న జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికల్లోనూ తెలుగుదేశం ఓటమి ఆ పార్టీ స్వయంకృతాపరాధమే అనుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశంకు ఫలితాలు అనుకూలంగా వచ్చినా నెల్లూరులో మాత్రం వ్యతిరేకంగా వచ్చాయి. ఇక్కడ సమిష్ట నాయకత్వం లేదు. నెల్లూరుపై పార్టీలోని ఏ నాయకుడికీ పట్టులేదు. దీంతో 54డివిజన్‌లకు అభ్యర్థుల ఎంపికే లోపభూయిష్టంగా జరిగింది. సమర్థులైనవారికి టిక్కెట్లివ్వాలనే ప్రాతిపదికన కాకుండా నాయకులు వాటాలేసుకుని టిక్కెట్లు తీసుకున్నారు. అప్పుడు బీజేపీతో పొత్తు వికటించడం కూడా పలు డివిజన్‌లలో తెలుగుదేశం అభ్యర్థుల విజయావకాశాలను దెబ్బతీసింది. ఇక ఎన్నికల ఫలితాలు వచ్చాయి. రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చింది. ఓ ఎనిమిది మంది కార్పొరేటర్లను తెచ్చుకుని వుంటే నెల్లూరు మేయర్ పీఠం తెలుగుదేశానికే దక్కి ఉండేది. కాని తెలుగుదేశం పెద్దనాయకులు జడ్పీ ఛైర్మెన్ పీఠం కోసం పట్టిన పట్టు మేయర్ పీఠం కోసం పట్టలేదు. దీంతో చివరి అవకాశం కూడా చేజారింది. నెల్లూరు నగరపాలక సంస్థ డాక్టర్లకు అచ్చిరాదని మరోసారి ఋజువయ్యింది.

# నమ్మకమే ఎమ్మెల్యేను చేసింది



***1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పుడు పంచాయితీ సర్పంచ్‌లుగా కూడా గెలవలేమనుకున్న వాళ్లు ఎమ్మెల్యేలయ్యారు. అది ఎన్టీఆర్ గాలి. ఆ గాలిలో అనామకులు కూడా శాసనసభ్యులై పోయారు. అలాగే ఇప్పుడు జగన్ గాలిలో కూడా అదే జరిగింది. గ్రహచారం బాగాలేక అతను అధికారంలోకి రాలేకపోయి ఉండొచ్చు గాని, జగన్ మూలంగా ఈరోజు చాలా మంది ఊహించని విధంగా ఎమ్మెల్యేలయ్యారన్న మాట మాత్రం వాస్తవం. రాష్ట్ర రాజకీయ చిత్రపటంలో తెలుగుదేశం, కాంగ్రెస్‌పార్టీలు మాత్రమే ఉండుంటే ఈరోజు శాసనసభలో మనం చూస్తున్న సభ్యులు చాలామంది ఉండేవాళ్లు కాదు. అంతెందుకు నెల్లూరుజిల్లాలోనే సగం మంది ఉండేవాళ్లు కాదు. జగన్ పార్టీని పెట్టబట్టే, ఆయన గాలి అంతో ఇంతో తోలబట్టే కొందరు అనూహ్యంగా ఎమ్మెల్యేలయ్యారు. అలాంటి వారిలో ఒకరే గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్‌కుమార్.***

నిన్నటి సార్వత్రిక ఎన్నికల్లో గూడూరు నుండి వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప తెలుగుదేశం అభ్యర్థి డాక్టర్ బి.జ్యోత్స్నలతపై తక్కువ మెజార్టీతో విజయం సాధించారు. మాజీఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాదరావుకు తెలుగుదేశంపార్టీ ఈసారి టిక్కెట్ నిరాకరించడం కూడా ఇక్కడ సునీల్‌కు కలిసొచ్చిన అంశం. నల్లపరెడ్డి కుటుంబానికి అత్యంత నమ్మకస్థుడు సునీల్. 1995లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గూడూరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా విజయం సాధించారు. చాలా చిన్నవయసులోనే మున్సిపల్ ఛైర్మెన్ బాధ్యతలను సమర్ధవంతంగా నెరవేర్చారు. దాని తర్వాత సునీల్‌కు రాజకీయంగా ఎటువంటి అవకాశాలు రాలేదు. కాని చాలాకాలం తెలుగుదేశంపార్టీలోనే కొనసాగారు. అయితే జగన్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించడం సునీల్ వంటి చాలామందికి రాజకీయ పునర్జన్మనిచ్చింది. జగన్ పార్టీ పెట్టగానే పాశం సునీల్ మరో ఆలోచనకు తావులేకుండా ఆ పార్టీలో చేరడం, గూడూరు ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం కావడంతో సునీల్‌కు అవకాశాలు మెరుగయ్యాయి. డాక్టర్ బాలచెన్నయ్య, బత్తిని విజయకుమార్ వంటి వారి నుండి సీటు విషయంలో పోటీ నెదుర్కొన్నా సీనియార్టీ మీద సీటును కొట్టేసారు. ఎన్నికలకు ముందే నియోజకవర్గంలో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించడంతో ఎన్నికల్లో విజయం పాశం వైపే మొగ్గుచూపింది.

# ఫలించిన కోటంరెడ్డి వ్యూహం



**నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికల్లో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మేయర్ పదవిని వైకాపాకు దక్కేలా చేయడంలో తనదైన పాత్రను పోషించారు. తద్వారా రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారంలో వున్నా నెల్లూరు కార్పొరేషన్‌లో వైకాపా అభ్యర్థిని గెలిపించాననే ఖ్యాతిని పొందారు. మేయర్ పదవికి అజీజ్‌ను ఎంపిక చేయడం ద్వారా పార్టీలోనూ, ముస్లింలలోనూ డిస్టింక్షన్ మార్కులు పొందగలిగారు.**

రాష్ట్ర వ్యాప్తంగా కూడా మున్సిపల్ ఛైర్మెన్‌లు, జడ్పీ ఛైర్మెన్‌ల ఎంపికలు ఏ తీరులో జరిగాయో ప్రత్యక్షంగా చూసాం. అంతకుముందు ప్రజలే నేరుగా జడ్పీ ఛైర్మెన్‌లు, మేయర్‌లు, ఛైర్‌పర్సన్‌లను ఎన్నుకునే పద్ధతి ఉండేది. అప్పుడు ఈ ప్రలోభాలు, అధికారిక ఒత్తిళ్లు లేకుండా ప్రజలు ఎవరికి ఓట్లేస్తే వాళ్లే పదవుల్లో ఉండేవాళ్లు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పద్ధతిని మార్చేసింది. పరోక్ష ఎన్నికల విధానానికి తెరలేపింది. దీనివల్ల అధికారంలో ఏ పార్టీ వుంటే స్థానిక సంస్థలలోనూ ఆ పార్టీ వాళ్లే ప్రభావితం చేసేవాళ్లు. అధికారపార్టీకి తక్కువ సీట్లు వచ్చినా ఆ పార్టీ అధికార బలప్రయోగంతో అవతల పార్టీ నుండి ఇంకొందరు సభ్యులను లాగి జడ్పీ ఛైర్మెన్, మేయర్, మున్సిపల్ ఛైర్మెన్ పదవులను లాగేసుకునేది. ఇప్పుడు రాష్ట్రంలో చాలాచోట్ల అదే జరిగింది.

అయితే నెల్లూరు నగరపాలక సంస్థ విషయంలో మాత్రమే అది జరగలేదు. మంత్రి నారాయణ దృష్టి పెడితే ఆదాల, ముంగమూరు వంటి సీనియర్ నాయకులు సీరియస్‌గా తీసుకుని వుంటే నెల్లూరు మేయర్ సీటు తెలుగుదేశంను దాటిపోయేది కాదు. వైకాపా నుండి 8మంది కార్పొరేటర్లను రప్పించుకోవడం పెద్ద సమస్య కూడా కాదు. తెలుగుదేశం పార్టీ వైపు నుండి అలాంటి గట్టి ప్రయత్నం జరగకుండా కోటంరెడ్డి అడ్డుకున్నారు. వైకాపా మేయర్‌గా అజీజ్ గెలిచాక తెలుగుదేశంలో చేరుతాడనే ప్రచారాన్ని బాగా వ్యాపింపజేసారు. దీనికితోడు అజీజ్ హైదరాబాద్‌లో మంత్రి నారాయణను కలవడం ఈ ప్రచారానికి బలం చేకూర్చింది. అజీజ్ మైనార్టీ అభ్యర్థి అని, మేయర్ ఎన్నికలలో అజీజ్‌ను ఓడిస్తే మైనార్టీలలో వ్యతిరేకత వస్తుందనే ప్రచారాన్ని పోటెత్తించాడు. దీంతో తెలుగుదేశం నాయకులు మనకెందుకొచ్చిన గొడవలే అని వూరుకున్నారు. అజీజ్ ఎలాగూ తెలుగుదేశంలోకి వస్తాడు కాబట్టి ఎవరు గెలిస్తే ఏముందిలే అని సరిపెట్టుకున్నారు. తెలుగుదేశం నుండి మేయర్ అభ్యర్థిగా డాక్టర్ జడ్.శివప్రసాద్‌ను గెలిపించుకోవాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గట్టిగా పోరాడాడు గాని మిగతా నాయకులు అంతగా దృష్టి పెట్టలేకపోయారు. మేయర్ అభ్యర్థి జడ్.శివప్రసాద్ సొంతంగా నలుగురు వైకాపా కార్పొరేటర్లను రప్పించుకోగలి గారు. పార్టీ నుండి సహకారం అంది వుంటే మరో నలుగురు కార్పొరేటర్లు రావడం సమస్య కాదు. కాని ఆ ప్రయత్నం లేకపోబట్టే 'మేయర్' టార్గెట్‌ను తెలుగుదేశం అందుకోలేకపోయింది. తమ కార్పొరేటర్లను రక్షించుకోవడానికి, మైనార్టీ వ్యక్తిని మేయర్‌గా చేసి జగన్ వద్ద తన పట్టు నిలుపుకోవడానికి, ముస్లింలలో తన నాయకత్వాన్ని బలోపేతం చేసుకోవడానికి కోటంరెడ్డి వేసిన ఎత్తుగడలన్నీ సక్సెస్ అయ్యాయి.

# ఆటపాటలతో ఆనందంగా జరిగిన "నాటా" సంబరాలు

**"ఉత్తర అమెరికా తెలుగు సంఘం"** (నాటా) రెండవ ద్వైవార్షిక సంబరాలు జూలై4, 5, 6తేదీలలో అమెరికాలోని జార్జియా రాష్ట్రం అట్లాంటా నగరంలో ఆడంబరంగా జరిగాయి. 4వతేది సాయంత్రం 6.30గంటలకు బాంక్వెట్‌తో ప్రారంభమైన వేడుక 6వతేదీ అర్ధరాత్రి దేవిశ్రీప్రసాద్ సంగీత సంరంభంతో ముగిసింది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో నివసించే తెలుగువారు సుమారు పదివేల మంది వరకూ ఈ మూడు రోజుల సభలలో పాల్గొన్నారు. నాటా అడ్వయిజరి కౌన్సిల్ ఛైర్మెన్ డా॥ ప్రేమసాగర్‌రెడ్డి స్వాగతోపన్యాసంతో మొదలైన బాంక్వెట్ సమావేశంలో ప్రముఖ గాయని శ్రీమతి సునీత తన పాటలతో అలరించింది. ఈ సందర్భంగా వివిధ రంగాలలో తమ తమ ప్రతిభలు చూపించిన పలువురు ప్రముఖులకు ఇదే వేదికపై అవార్డులు అందించారు. అమెరికా, భారత దేశాల జాతీయగీతాలతో మొదలైన వేడుకలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం రాత్రి 12గంటలకు ముగిశాయి.



## శ్రీహరిరెడ్డికి నాటా సేవాడేస్ గుర్తింపు అవార్డు

నెల్లూరుకు చెందిన వ్యాపారవేత్త మమత నర్సింగ్ హోమ్ అధినేత బద్దెవోలు శ్రీహరిరెడ్డికి 2013 డిసెంబర్‌లో నెల్లూరు జిల్లాలో జరిగిన "నాటా డేస్"ని సమర్ధవంతంగా నిర్వహించడంతో పాటు, నాటా ఆధ్వర్యంలో జిల్లాలో ఏర్పాటు చేస్తున్న వివిధ మంచినీటి పథకాలతో పాటు పలుసేవా కార్యక్రమాల కోసం శ్రీహరిరెడ్డి అందిస్తున్న సహాయసహకారాలను అభినందిస్తూ ఆయనకు సేవా అవార్డును నాటా ప్రదానం చేసింది.



## రామిరెడ్డి రామచంద్రారెడ్డికి సమాజ సేవా అవార్డు

నెల్లూరు జిల్లాకు చెందిన మరో ప్రముఖుడు రామిరెడ్డి రామచంద్రారెడ్డి కూడ నాటా అవార్డుతో సత్కరించింది. 1970వ సంవత్సరం నుండి అమెరికాలో స్థిరపడి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అనేక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ ఇంకా "ఆటా", తానా, నాటా వంటి సంస్థల నేతృత్వంలో వివిధ హోదాలలో విధులు నిర్వహించి తన సత్తా చాటుకున్నందుకుగాను ఆయనకు ఈ అవార్డు లభించింది. ఈ యేడాది నాటా అవార్డులు అందుకున్న వారిలో శ్రీహరిరెడ్డి, రామచంద్రారెడ్డి ఇద్దరూ నెల్లూరీయులు కావడం గమనార్హం.

జూలై 5వతేదీ రెండవరోజు ఉదయం 9గంటలకు ప్రధాన వేదికపైన మొదలైన సాంస్కృతిక కార్యక్రమాల సందడి అదేరోజు అర్ధరాత్రి 12గంటల వరకూ నిరంతరాయంగా కొనసాగింది. మరోవైపు ఇదే ప్రాంగణంలో ఉన్న పలు సమావేశ మందిరాల్లో సైతం కవి సమ్మేళనాలు, అష్టావధానాలు, సిరివెన్నెల సీతారామశాస్త్రి నిర్వహించిన "అంతరంగం", పలు టి.వి. ఛానళ్ళు నిర్వహించిన రాజకీయ చర్చా వేదికలు, యువతరానికి ఉపయోగపడే సెమినార్‌లు ఉదయం నుండి రాత్రి వరకూ కొనసాగాయి.

జూలై 6వతేదీ ఆదివారం ఉదయం ప్రముఖ అన్నమయ్య సంకీర్తనా గాయని శ్రీమతి శోభారాజ్‌చే నిర్వహించబడిన అన్నమయ్య సంకీర్తనారాధనతో మూడవ రోజు కార్యక్రమాలు మొదలయ్యాయి. ఇదేరోజు వై.యస్.ఆర్.ఫౌండేషన్ సభ, నెల్లూరు యన్.ఆర్.ఐల సమావేశం వెన్నెల కంటి, రసరాజు తదితరులు పాల్గొన్న నరాల రామిరెడ్డి అష్టావధానం, నెల్లూరు కళాకారిణి శ్రీమతి బాలార్క అన్నమయ్య కీర్తనలు, వివిధ జిల్లా ప్రతినిధులతో సభలు, సమావేశాలు జరిగాయి. సాయంత్రం 7గంటలకు మొదలైన ముగింపు సభాకార్యక్రమంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, తెలుగుదనానికి ప్రతిబింబాలుగా అమెరికాలో ఉంటున్న తెలుగు చిన్నారులు ప్రదర్శించిన ప్రత్యేక అంశాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. చివరగా దేవిశ్రీప్రసాద్ నిర్వహించిన సంగీత కార్యక్రమంతో సంబరాలు ముగిసాయి.

## యస్.పి.బాలుకి జీవిత సాఫల్య పురస్కారం



"నాటా" ముగింపు సభలో ప్రముఖ సినీ నేపథ్యగాయకుడు పద్మభూషణ్ బిరుదాంకితులు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యంకి "జీవిత సాఫల్య పురస్కారాన్ని" నాటా అందించింది. నాటా అధ్యక్షుడు డా॥ సంజీవరెడ్డితో కలసి డా॥ప్రేమ్‌రెడ్డి, మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డా॥మల్లారెడ్డి, సిరివెన్నెల సీతారామశాస్త్రి, జొన్నవిత్తుల, చంద్రబోస్, సినీనటీమణులు తమన్నా, ప్రణీత, విమలారామన్ తదితరులు బాలసుబ్రహ్మణ్యానికి జీవితసాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ గత 48సంవత్సరాలుగా తనని ఆదరిస్తున్న శ్రోతలందరి గడపలకి వెళ్ళి తాను కృతజ్ఞతలు తెలుపుకోలేనని, ఇలాంటి సత్కార సమావేశాలలో పాల్గొని ఈ సభల ద్వారా వీలయినంత ఎక్కువ మందిని కలుసుకుని తన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని, తనకి ఈ అవార్డుతో పాటు అవకాశం ఇచ్చిన "నాటా" వారికి ధన్యవాదాలు తెలుపుకున్నారు. "పుణ్యభూమి నా దేశం నమో నమామి" పాటను ఆలపించి అందరి మన్ననలను అందుకున్నారు.

## నెల్లూరు టీమ్...

ఈ సమావేశాలలో కీలక భూమిక పోషించి, మూడు రోజుల కార్యక్రమాలు విజయవంతం కావడానికి కృషిచేసిన ఆర్గనైజింగ్ కమిటీలో ఎక్కువశాతం నెల్లూరీయులు వుండడం గమనార్హం గర్వకారణం కూడా. నాటా ఛైర్మెన్ డా॥ప్రేమ్‌రెడ్డి, మలిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, కొర్శపాటి శ్రీధర్‌రెడ్డి, గోశాల రాఘవరెడ్డి, కృష్ణపాటి రమణారెడ్డి, చిల్లకూరు గోపీరెడ్డి, మండవ సురేష్, కోటంరెడ్డి విష్ణుకుమార్‌రెడ్డి, సోమవరపు శ్రీనివాసులరెడ్డి, దువ్వూరు విష్ణురెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, విజయలక్ష్మి అప్పారెడ్డిలతో పాటు ఇతర జిల్లాలకు చెందిన చినబాబురెడ్డి డా॥స్టాన్లీరెడ్డి, ఆళ్ళ రామిరెడ్డి, గిరీష్‌రెడ్డి, బీమ్‌రెడ్డి ప్రతాప్‌రెడ్డి, గంగసాని రాజేశ్వరరెడ్డిలతో సహ ఇంకా పలువురు సభ్యులు ఈ మూడు రోజుల సంబరాలను చిరస్మరణీయం చేయడానికి విశేషకృషి జరిపారు. సుమారు పదివేల మంది పాల్గొన్న ఈ కార్యక్రమాలను న భూతో న భవిష్యతి అన్న రీతిలో నిర్వహించిన నిర్వాహక బృందం అంతా అభినందనీయులే. 2016 మే 27, 28, 29వతేదీలలో 3వ ద్వైవార్షిక సమావేశం టెక్సాస్ రాష్ట్రంలోని డాలస్ నగరంలో జరగనున్నట్లు ప్రకటించారు.

# జెఇఇ మెయిన్స్‌లో సత్తాచాటిన శ్రీలేఖ



నెల్లూరుజిల్లాకు చెందిన ప్రముఖ రచయిత్రి దోర్నాదుల సుబ్బమ్మ మనుమరాలు దోర్నాదుల శ్రీలేఖ జెఇఇ మెయిన్స్ ఫలితాలలో జాతీయ స్థాయిలో రెండవ ర్యాంకు సాధించి తన సత్తా చాటి నెల్లూరు కీర్తిపతాకాన్ని ఎగురవేశారు.

బిటెక్‌లో ఆలిండియా రెండవ ర్యాంకు సాధించిన ఆమె, బిఆర్క్‌లో ఆలిండియా 8వ ర్యాంకును సాధించి ఖరఘ్‌పూర్ ఐఐటి కాలేజీలో ఎలక్ట్రికల్ విభాగంలో సీటు పొందారు. శ్రీలేఖ తండ్రి డి.రవీంద్రరెడ్డి ముత్తుకూరులోని మత్స్య కళాశాలలో ఆచార్యులుగా పనిచేస్తుండగా, తల్లి జయప్రద పిహెచ్‌డి పట్టభద్రురాలు. ఆమె తమ్ముడు రేవంత్‌రెడ్డి బిటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. శ్రీలేఖ మూడవ తరగతి వరకు ఖమ్మంలోను, 4 నుండి 6వ తరగతి వరకు నెల్లూరులోని రత్నం స్కూల్‌లోను, 7 నుండి 8వ తరగతి వరకు హైదరాబాద్ గురుదత్త స్కూల్‌లోను, 9 నుండి సీనియర్ ఇంటర్ వరకు హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో చదివారు. 6వ తరగతిలోనే నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ ప్రతిభా పరీక్షలో ఆల్‌ఇండియా 2వ ర్యాంకు సాధించారు. 10వ తరగతిలో 9.8 శాతం మార్కులు సాధించిన ఆమె, ఇంటర్మీడియట్‌లో 989మార్కులు సాధించారు. 9వ తరగతిలో ఎన్‌టియస్‌ఇ స్కాలర్‌షిప్ హోల్డర్ గాను, ఇంటర్మీడియట్‌లో కె.వి.పి.వై స్కాలర్‌షిప్ హోల్డర్‌గాను అర్హత పొందారు. ఎంసెట్‌లో 190వ ర్యాంకును, ఐఐటిలో ఆల్‌ఇండియా స్థాయిలో 471వ ర్యాంకును సాధించారు. తన తల్లిదండ్రుల ప్రోత్సాహం, నిరంతరం క్రమశిక్షణతో అధ్యయనం చేయడం, అధ్యాపకుల సహకారంతోనే తాను ఈ ర్యాంకులు సాధించగలిగానని శ్రీలేఖ 'లాయర్'కు తెలిపారు. జాతీయ స్థాయిలో అత్యున్నత ర్యాంకును సాధించి నెల్లూరు జిల్లా విద్యారంగానికే వన్నె తెచ్చిన శ్రీలేఖకు 'లాయర్' అభినందనలు.

# వేడుకగా గురుపూర్ణిమ మహోత్సవాలు

శ్రీ షిర్డి సాయినాధుని గురుపూర్ణిమ మహోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నెల్లూరు నగరంలోని గాంధీనగర్ (ట్రంకురోడ్డు)లో వున్న శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో ఆలయ నిర్వాహకులు మన్నెం అమరనాధరెడ్డి తదితరుల నేతృత్వంలో ఈ మహోత్సవాలు ఈ నెల 12 నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 20వతేది వరకు వైభవోపేతంగా జరిగే ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా శ్రీ సాయినాధునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్రనామ పూజలు, ప్రతిరోజు షిర్డి హారతులు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా 12 నుంచి 19వతేది వరకు వారం రోజుల పాటు ఆలయ సమీపంలోని కో-ఆపరేటివ్ సెంట్రల్‌బ్యాంక్ ఆవరణంలో ప్రఖ్యాత ఉపన్యాసకులు, రామాయణ ప్రవచన సుధాకర బిరుదాంకితులు డా.మైలవరపు శ్రీనివాసరావు రామాయణంలోని సుందరకాండ-దాని అంతరార్థాలను వివరించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. 17వ తేది సాయంత్రం వైభవోపేతంగా స్వామివారి నగరోత్సవం నిర్వహిస్తారు. 20వ తేది మధ్యాహ్నం 11 గంటలకు పెద్దఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తారు.

**శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరంలో...** అదేవిధంగా నగరంలోని పద్మావతినగర్‌లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో గురుపూర్ణిమ మహోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఈ ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తారు. 12వ తేదీన శ్రీసాయినాధునికి కాకడ హారతి, ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం అన్నసంతర్పణ చేస్తారు. రాత్రి 9 గంటలకు సాయినాధునికి ప్రత్యేక పల్లకి ఉత్సవం నిర్వహిస్తారు. 13వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు సాయి సచ్చరిత్ర పారాయణం వుంటుంది






## హైదరాబాద్ పిచ్చి

మన సీమాంధ్ర వాళ్ళకు ఇంకా బుద్ధిరాలేదు. ఇంత జరిగాక కూడా ఇంకా హైదరాబాద్‌ను వదల్లేక పోతున్నారు. మొన్న ఎన్నికల్లో గెలిచీ గెలవగానే ఇక సీమాంధ్రలో వుండే పరిపాలన చేస్తానని చెప్పిన ముఖ్య మంత్రి చంద్రబాబు మాట తప్పాడు. హైదరాబాద్‌లోనే ఉండిపోయేట ట్లున్నాడు. ఇంకా హైదరాబాద్‌లో ఉండిపోవడమంటే సీమాంధ్రకు ద్రోహం చేయడమే!

*జి.వి. శేఖర్,* వాసిలి.

## హామీ మాఫీ

పేదరికాన్ని నిర్మూలిస్తానన్న ఒక రాజకీయనాయకుడు, పేదల్నే నిర్మూ లించడానికి పూనుకున్నాడట! అలా వుంది బూటకపు వాగ్దానాల ప్రదాత సీమాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యవహారం. రైతుల రుణమాఫీ చేయకుండా రుణమాఫీ హామీనే మాఫీ చేయడా నికి ఒక కమిటీని వేసి రైతుల ఆత్మ హత్యలకు కారకుడవబోతున్నాడు. చంద్రబాబు పునరాలోచించి కమి టీని రద్దు చేసి రైతుల రుణమాఫీ చేసి రైతుబాంధవుడు అనిపించుకో వాలని నవ్యాంధ్రప్రదేశ్ రైతులు కోరుకుంటున్నారు.

*కురుగూరు రంగనాథం,* నెల్లూరు.

## చెదిరిన కల

తన 44ఏళ్ల పసిబిడ్డ రాహుల్ గాంధీని ప్రధాని పీఠం ఎక్కించి ఆ తర్వాత పెళ్లిపీటల మీద కూర్చో బెట్టాలని సోనియా గాంధీ ఆశ పడింది. ఏడు ఖండాల నుండి దేశాధినేతలు వచ్చి అక్షింతలు చల్లాలని, ప్రపంచ చరిత్రలోనే తన కొడుకు పెళ్లి ఒక సంచలన ఘట్టం కావాలని ఆశ పడింది. అందుకోసం రాష్ట్ర విభజన చిచ్చుపెట్టి సీమాంధ్రులను క్షోభ పెట్టింది. దేవుడున్నాడు. తగిన శాస్తి చేసాడు. 44ఏళ్ల వృద్ధయువకుడి పార్టీకి 44సీట్లే ఇచ్చాడు. తెలంగాణలో కేసీఆర్‌ను, సీమాంధ్రలో జగన్‌ను చేతిలో పెట్టుకుని రాజ్యమేలొచ్చను కున్న సోనియాకు దిమ్మ తిరిగే ఫలి తాలొచ్చాయి. కుట్ర, కుళ్ళు ఎప్పటికీ మంచి ఫలితాలనివ్వవు అనేదానికి ఇదే సాక్ష్యం.

*కుమారి మన్నిముత్తుల,* లేబూరు.

## 'ప్రభా'తం

కొంత కొత్తదనం..కొంత పాతదనం..కొన్ని సరికొత్త ఆలోచనలు... కొన్ని పాత కొనసాగింపులు...తప్పనిసరిగా చేయాల్సినవి కొన్ని.. చేయాలనుకున్నవి కొన్ని... ప్రస్తుతానికి అత్యవసరమైనవి కొన్ని..భవిష్యత్తుకు ప్రగతిదాయకమనుకున్నవి మరికొన్ని..ఇలా అన్నిటినీ రంగరించి.. మేళవించి, మేలైన పథకాల కొత్త రుచులతో అందించిన ఎన్డీఏ తొలి రైల్వే బడ్జెట్ ఇది. అది కొందరికి మోదాన్ని, మరికొందరికి ఖేదాన్నీ కలిగించినప్పటికీ, కొందరిలో ఆశలను, మరికొందరిలో నిరాశలను మిగిలించినప్పటికీ, మొత్తమ్మీద చూస్తే గతంలో కన్నా ఇది ఎంతో మేలైన బడ్జెట్టేనని, అన్నిటికన్నా మించి, ఇది మంచి సంస్కరణల బడ్జెట్టేనని చెప్పవచ్చు. ఇప్పుడు ఈ సంస్కరణల విధానాలతో ప్రారంభించిన ప్రయాణం.. భవిష్యత్తులో మరింత వేగంగా, భద్రతగా, సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చునే భరోసాను కూడా కలిగిస్తోందనే చెప్పవచ్చు. దేశవ్యాప్తంగా మరింత భవ్యమైన ప్రగతికి ఇది తొలి సోపానం అవుతుందనీ అనుకోవచ్చు. మంగళవారం కేంద్ర రైల్వే మంత్రి సదానందగౌడ ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌పై సహజంగానే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు ఈ బడ్జెట్ బాగుందంటే, మరికొందరు చేదుగానే వుందన్నారు. ఇది సాదాసీదా బడ్జెట్టేనని, కొత్తదనమేమీ లేదని కొందరంటే, ఇది నిరాశాజనకమైన, నిరుప యోగమైన బడ్జెట్ అనీ, పెట్టుబడిదారీ విధానాలు అవలంభిస్తూ రైల్వేల ప్రైవేటీ కరణకు దారులు తెరిచేవిధంగా వుందని మరికొందరి విమర్శ. ఇది సంపన్నుల బడ్జెట్‌లా వుందే తప్ప సామాన్యులకు ఉపకరించదని.. ఇందులో కొత్త పథకాలు కానీ, నూతన ప్రణాళికలు కానీ ఏమీ లేవని ప్రతి పక్షాల నుంచి అసంతృప్తులూ వెల్ల డయ్యాయి. అయితే, అందుకు ప్రభుత్వం కూడా తగ్గకుండా తగ్గట్టు గానే స్పందించింది. తమవి ఖచ్చిత మైన విధానాలేనని సమర్ధించుకుంది.



### 'బుల్లెట్' బడ్జెట్

దేశంలో ప్రస్తుతం సంక్షోభంలో వున్న ఆర్థిక రంగం నుంచి తిరిగి రైలుబండిని గట్టెక్కించేం దుకు, మరింతవేగంతో, భద్రతతో, సురక్షితంగా ప్రయాణం సాగించేందుకు అనువైన మార్గాలన్ని టినీ కొత్త ప్రభుత్వం పరిశీలించి, రానున్న ప్రగతిని ఊహించి వ్యూహా త్మకంగా ప్రణాళికలు రూపొందిస్తుండడం హర్షదాయకం.

గతంలో కాంగ్రెస్ పాలనలో వేలాది కోట్లతో బడ్జెట్ కేటాయింపులు చేశారే తప్ప, అత్యధికశాతం ప్రాజెక్టులు పూర్తి కాలేదనీ, అనేకం నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లున్నాయనీ, వాటన్నిటినీ వేగవంతం చేసి, కొత్త పథకాలు రూపొందించక తప్పదనీ స్పష్టం చేసింది. గత మూడు దశాబ్దాల్లో 676 ప్రాజెక్టులు మంజూరైతే, వాటిలో ఇప్పటికి కేవలం 317 మాత్రమే పూర్తయ్యాయి.. మిగిలిన 359 ప్రాజెక్టులు పూర్తికావాలంటే లక్షా 82 వేల కోట్ల రూపాయలు కావాల్సివుంది. గత పదేళ్ళలో 99 ప్రాజెక్టులు మంజూరుచేశారు కానీ, వాటిలో పూర్తయింది కేవలం ఒకే ఒక్కటేనంటూ సాక్షాత్తూ కేంద్ర రైల్వేమంత్రి సదానందగౌడ బడ్జెట్ సందర్భంగా ఆ వివరాలన్నీ తెలిపారు. నిజంగా ఇవన్నీ ఎంతో ఆశ్చర్యం కలిగించే విషయాలే. గత ప్రభుత్వం తమ చిత్తం వచ్చినట్లుగా అలా ప్రజాకర్షక ప్రాజెక్టులు ప్రకటించిందే తప్ప, ఆచరణలో వాటిలో వేటినీ అమలుచేయకపోవడం శోచనీయం. అలాంటి అస్తవ్యస్త పరిస్థితుల నుంచి బయటపడి, రైల్వేలను గాడిలో పెట్టేందుకు కొత్త ప్రభుత్వం పెద్దగా కసరత్తు చేయాల్సివస్తోంది. రైల్వేమంత్రి ప్రకటించిన వివరాల మేరకు..ఇప్పుడు దేశంలో 12,617 రైళ్ళు వున్నాయి. దాదాపు రెండుకోట్ల 30 లక్షల మంది ప్రయాణీకులు నిత్యం రైళ్ళలో ప్రయాణం చేస్తున్నారు. సరకు రవాణా చేసే రైళ్ళ సంఖ్య 7,421 దాకా వున్నాయి. వీటి ద్వారా రోజుకు 30 లక్షల టన్నుల దాకా సరుకు రవాణా అవుతుంటుంది. మన రైల్వే ట్రాక్ పొడవు 1.16 లక్షల కిలోమీటర్లు. 13.1 లక్షల మంది ఉద్యోగులు రైల్వేలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం నడుస్తున్న ప్రాజెక్టులకే ఏడాదికి రూ.50వేల కోట్ల వంతున నిధులు కావాల్సివస్తోంది. ఆ మేరకు రానున్న పదేళ్ళలో అయిదు లక్షల కోట్లు అవసరం. వీటికే ఇంత ఖర్చయితే, ఇక భద్రతా చర్యలు, మౌలిక సదుపాయాల కల్పన, కొత్త ట్రాక్‌లు, కొత్త రైళ్ళు, రైల్వేస్టేషన్ల అభివృద్ధి వంటివన్నీ ఎలా సాధ్యం?.. ఆదాయాన్ని మించిన ఖర్చులతో రోజూ రైలుబండిని ఎలా నడపాలి?.. సరిగ్గా ఇలాంటి ఆలోచనలతోనే కొత్త ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ఆర్థిక వనరుల సమీకరణకు నూతన మార్గాలను అన్వేషిస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో భారీగా నిధులు సమీకరించైనా సరే, రైల్వేలను అంతర్జాతీయ ప్రమాణాలతో, ప్రతిష్టాత్మకమైన ప్రగతిదారికి మళ్ళించాలన్నదే లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రైవేటు వైపు పరుగులు తీయడం మంచిదికాదనే విమర్శలున్నప్పటికీ, భవిష్యత్తులో ప్రగతికి అనువైన దారులను అన్వేషించే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఆ ప్రయత్నానికి కూడా సంకల్పించినట్లు భావించవచ్చు. అసలే, దేశంలో గత పదేళ్లుగా ఆర్థికరంగం అస్తవ్యస్తంగా తయారుకావడం, అన్ని రంగాలతో పాటు రైల్వేరంగమూ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయి వుండడం, సరైన వసతులు లేక, భద్రత లేక అనేకానేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో నూతనంగా వచ్చిన మోడీ ప్రభుత్వం రైల్వే రంగాన్ని సంస్కరణల బాట పట్టించి, తద్వారా మెరుగైన, మేలైన సౌకర్యాలను సమకూర్చేందుకు చేయాల్సిన అన్ని ప్రయత్నాలు చేస్తుండడం ఎంతైనా హర్షదాయకమనే చెప్పాలి.

ప్రగతి ద్వారాలను తెరవాలంటే నిధుల సమీకరణకు వ్యూహాత్మక ప్రణాళికలతో, కొత్త మార్గాలను అన్వేషించక తప్పదనే పంథాలో కొత్త ప్రభుత్వం పయనిస్తూ, రైల్వేలకు మరింత ప్రాధాన్యత రావాలని, రైల్వేలు భద్రత-పరిశుభ్రత, పారదర్శకతలకు ప్రతీకగా వుండాలనీ కృషి చేస్తోంది. అందుకే ఈ బడ్జెట్ భద్రత, సేవల విషయంలో భరోసా కల్పిస్తూ సామాన్యుల కోసం రూపొందించారని, ఇది పటిష్టీకరణ, పారదర్శకత, సమగ్రతలను ప్రతిబింబిస్తోందని, ఇది రైల్వేలకే కాదు..దేశానికీ దిశను చూపించేవిధంగా వుందని ప్రధాని మోడీ కొనియాడారు. అందుకు తగ్గట్టుగానే ఈ బడ్జెట్‌లో అనేక కొత్త ప్రతిపాదనలూ, నిర్ణయాలు చేశారు. అహ్మదాబాద్-ముంబైల మధ్య రూ.60 వేల కోట్లతో అత్యంత వేగవంతమైన బుల్లెట్ రైలును పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం సంకల్పించడం ఎంతైనా సాహసోపేతమైన నిర్ణయమే. అదేవిధంగా, మెట్రో నగరాలను, ప్రధాన నగరాలను కలుపుతూ హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్(వజ్ర చతుర్భుజి నెట్‌వర్క్)ను నిర్మించాలన్నది కూడా బృహత్తరమైన నిర్ణయమేనని చెప్పవచ్చు.

ఏదేమైనా, దేశంలో ప్రస్తుతం సంక్షోభంలో వున్న ఆర్థికరంగం నుంచి తిరిగి రైలుబండిని గట్టెక్కించేందుకు, ఆ తర్వాత అది మరింత వేగంతో, భద్రతతో, సురక్షితంగా ప్రయాణం సాగించేందుకు అనువైన మార్గాలన్నిటినీ కొత్త ప్రభుత్వం పరిశీలించి, భవిష్యత్తులోనూ రానున్న ప్రగతిని ఊహించి వ్యూహాత్మకంగా ప్రణాళికలు రూపొందిస్తూ ముందుకు సాగుతుండడం హర్షదాయకం.

## 'అంతర్'జాతీయం

- అమెరికా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నలుగురు భారత సంతతి అమెరికన్‌లతో సహా 40మందిని సన్మానించారు. సన్మానం పొందిన వారిలో మైక్రోసాఫ్ట్ సిఇఓ సత్యనాదెళ్ల కూడా ఉన్నారు.
- ఉత్తర వజీరిస్థాన్ గిరిజన ప్రాంతంలో 'తెహ్రికే తాలిబన్ పాకిస్థాన్' ఉగ్ర వాద శిబిరాలపై పాక్ రక్షణ బలగాలు ఈ నెల 5న వైమానిక దాడులు చేసాయి. ఈ దాడుల్లో పలువురు ఉగ్రవాదులు మరణించారు.
- ఉన్నత న్యాయస్థానాలలో జడ్జిల నియామకానికి సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులో మార్పులు చేర్పులు చేసే అవకాశముందని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు.
- యూపిఏ పాలనాకాలంలో జరిగిన బొగ్గు కుంభకోణం థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపిందని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి పియూష్‌గోయల్ పేర్కొన్నారు. దీనివల్ల సుమారు 65వేల మెగావాట్ల సామర్థ్యంగల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మూతపడ్డాయన్నారు.
- దేశంలో ప్రతి పదిమందిలో ముగ్గురు పేదలేనని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి మాజీఛైర్మెన్ రంగరాజన్ నేతృత్వంలోని కమిటీ పేర్కొంది. 2011-12లో దేశంలో 29.5శాతం జనాభా పేదరికంలో ఉందని ఈ కమిటీ వెల్లడించింది.
- దక్షిణపోలాండ్‌లో జరిగిన విమాన ప్రమాదంలో 11మంది దుర్మరణం చెందారు. ఈ నెల 6న ఈ సంఘటన జరిగింది.
- ఇటీవల అయిదు ఉపగ్రహాలను ఒకేసారి విజయవంతంగా కక్ష్యలోకి పంపిన ఇస్రో శాస్త్రవేత్తల బృందాన్ని లోక్‌సభ సోమవారం అభినందించింది.
- ప్రధాని నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడు, ప్రస్తుతం బీజేపీ ప్రధాన కార్యదర్శి అమిత్‌షాను బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ నెల 9వ తేదీ పార్లమెంటరీ పార్టీ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- గ్యాస్ కొరత నుండి గట్టెక్కించండి. – సీఎంను కోరిన విద్యుత్ ఉత్పత్తిదారుల సంఘం.
**వ్యాఖ్య :-** ***ముందు ఆయనను సమస్యల నుండి గట్టెక్కనివ్వండి.***

వార్త :- విపక్షనేత హోదాను కాంగ్రెస్‌కు ఇవ్వాల్సిందే! – సోనియా డిమాండ్.
**వ్యాఖ్య :-** ***ఈ మాత్రం డిమాండ్ ప్రజలనే చేసుంటే ఇచ్చేవాళ్లేమో!***

వార్త :- సభలో చురుగ్గా రాహుల్.
**వ్యాఖ్య :-** ***అదే ప్రధాని అయ్యుంటే ఇంత చురుగ్గా ఉండేవాడా?***

వార్త :- సామాన్యుడి చేరువలోకి ఉపగ్రహ పరిజ్ఞానం. – ఇస్రో ఛైర్మెన్ రాధాకృష్ణన్‌తో చంద్రబాబు.
**వ్యాఖ్య :-** ***సామాన్యుడికి కూడు, నీడ లేకపోయినా ఉపగ్రహ పరిజ్ఞానం ఉంటే చాలంటారా?***

వార్త :- ఆంధ్రప్రదేశ్‌లో బ్రతకాలంటే భయమేస్తుంది. – స్థానిక ఎన్నికల నిర్వహణపై జగన్.
**వ్యాఖ్య :-** ***అందుకని తెలంగాణలో ఉండిపోతారా, ఏంటి?***

వార్త :- వైద్యకళాశాలలకు నిధులివ్వండి. – ప్రధానికి చంద్రబాబు లేఖ.
**వ్యాఖ్య :-** ***లేఖలతో నిధులొస్తే అందరూ అదే పనిచేయరూ?***

వార్త :- ఇక ప్రజలు, కార్యకర్తలతోనే ఉందాం. – ఏపిసిసి సమావేశంలో చర్చ.
**వ్యాఖ్య :-** ***అంతకుమించి చేసేదేముందిలే...***

వార్త :- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి సమయమిద్దాం. – అశోక్‌బాబు.
**వ్యాఖ్య :-** ***ఓ ఐదేళ్లు సరిపోతుందా?***

వార్త :- ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన పెట్టాలి. – వైకాపా.
**వ్యాఖ్య :-** ***మరీ అంత తొందరైతే ఎలా?***

# కమ్ముకొస్తున్న కరువు.. వానలేమో కురవవు!

**జిల్లాలో ఇప్పుడు ఎటు చూసినా తీవ్ర వర్షాభావం కనిపిస్తోంది. అనేక ప్రాంతాల్లో చెరువులు, బావులు, కాలువలు, వాగులు, వంకల్లో ఎక్కడా చుక్క నీరు కనిపించడం లేదు. వరుణుడు కరుణించకపోవడంతో వాన చినుకుల జాడ కనిపించడం లేదు. నీలి మేఘాలు ఊరిస్తూ కనిపిస్తున్నాయి కానీ, నీటి చుక్కలు విదిలించడం లేదు.**

- ఈసారి ఖరీఫ్‌కు కరువు కాటు తప్పేనా?
- అయోమయంలో రైతులు.. పట్టించుకోని అధికారులు



భూగర్భజలాలు పూర్తిగా అడుగంటి పోవడం, నీటి వనరులు ఎండిపోవడం, వానలు కురవకపోవడం మరోవైపు ఇంకా ఎండలు మండిపోతూనే వుండడం ఇవన్నీ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ పరిస్థితులన్నీ చూస్తుంటే జిల్లాపై కరువు మేఘాలు కమ్ముకొస్తున్నాయంటూ రైతన్నలు ఆవేదనతో చెప్తున్నారు. ఈ సీజన్‌లో వానలు కురవకుంటే ఇక ఖరీఫ్ పంటలకు స్వస్తి పలకాల్సివస్తుందని, పంటలే లేకుంటే ఇక జీవనమెట్లా?..అని వారు భయాందోళనతో వున్నారు. ఈ ఖరీఫ్ సీజన్ రైతులను బాగా ఆందోళనలకు గురిచేస్తోంది. దుక్కులు దున్నుకుని, నాట్లు వేసుకునే ఈ సీజన్‌లో అదునుకు పదునైన వానలు కురుస్తాయనుకుంటే, వానలు పడాల్సిన ఈ (జూలై) నెలలోనూ ఎండలు మరీ మండిపోతుండడం రైతులను అయోమయానికి గురిచేస్తోంది. ఈ తగ్గని ఎండలను చూస్తుంటే, ఈ సీజన్‌లో అసలు వర్షాలు కురుస్తాయో లేదోనని జిల్లాలోని రైతులంతా దిగులుతో వున్నారు. ఎల్‌నినో ప్రభావమో ఏమో..ఎటు చూసినా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, జిల్లాలోని ఖరీఫ్ రైతాంగం ఈ ఏడాది పంటలు పండించగలమా?..అనే సందిగ్ధంలో పడిపోయారు. అటు వరుణుడి కరుణ లేక, ఇటు అనువైన నీటి వనరులు లేక ఆరుగాలం కష్టించి, పంటలు సాగు చేసుకునే అన్నదాతలు ఇప్పుడు సమస్యల సుడిగుండాల్లో పడి కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని అనేక చెరువులు నీరు లేక ఎండిపోయి నెర్రెలు బారిపోయాయి. జలాశయాల్లో సైతం నీటిమట్టం అడుగంటిపోయింది. బోర్లు, బావులు ఎండిపోయి వెలవెలబోతున్నాయి. దీంతో, ఈ ఖరీఫ్‌లో వేలాదిమంది రైతులు నేటికీ సేద్యానికి దిగలేకపోతున్నారు. వాన రాకపోవడంతో కాడి పట్టడానికి సాహసించలేకపోతున్నారు. ఒకవేళ పంటలు వేసుకున్నా, అవి ఎండిపోవడం మినహా మరో గత్యంతరం లేదని నిరాశకు గురైవున్నారు. దీనికితోడు, బోర్ల మోటార్ల కింద పంటలు, తోటలు పండించుకునే రైతులు సైతం విద్యుత్ సరఫరా సక్రమంగా లేక, అసలు సేద్యమంటేనే విసుగెత్తిపోతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా విద్యుత్ సరఫరా మెరుగు కాకపోవడం వారిని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. మరోవైపు జిల్లాకు ప్రాణప్రదమైన సోమశిల, కండలేరు జలాశయాల్లో కూడా నీటిమట్టం అడుగంటిపోవడంతో, వాటి కాలువల కింద సాగయ్యే పంటల విస్తీర్ణం కూడా బాగా తగ్గిపోయింది. జిల్లాలో ప్రధాన పంట అయిన వరి సాగు ఈసారి గణనీయంగా తగ్గిపోవడంతో వరి రైతుల బాధలు వర్ణనాతీతంగా వుంటున్నాయి. సాధారణంగా ఈ సీజన్‌లో ఎటుచూసినా పచ్చని వరి పొలాలతో కళకళలాడాల్సిన జిల్లా, అనేక ప్రాంతాల్లో నెలకొన్న సాగునీటి ఎద్దడితో వేలాది ఎకరాలు బీడుభూములుగానే వుండిపోయి బోసిపోయి కన్పిస్తున్నాయి. రైతులకు జీవనాధారమైన వరిపంట సాగు ఇలా కుదేలైపోతుండడంతో, రైతులు తమ కుటుంబాలను పోషించుకోలేక మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో సన్న, చిన్నకారు రైతుల జీవన పరిస్థితులు మరింత దయనీయంగా, దుర్భరంగా మారిపోతున్నాయి. అసలే, కష్టానికి తగ్గ గిట్టుబాటు ధరలు లేక, వ్యవసాయం ఫలసాయం కాక అనేక మంది సన్న, చిన్నకారు రైతులు ఇతరత్రా పనులకు, కొంతమంది కూలి పనులకు కూడా వలసలకు పోయే దుస్థితి దాపురించింది. జిల్లాలో నెలకొన్న ఈ తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో, నీటి వనరులు లేక అనేక మండలాల్లో అప్పుడే కరువు ఛాయలు కమ్ముకుంటుండడంతో రైతులు దిగాలు పడిపోతున్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలుగా వేరుశెనగ వంటి ఆరు తడి పంటలు వేసుకుందామన్నా తగు వర్షాలు లేకపోవడంతో, ఆ రైతులు కూడా వరుణుడి కరుణ కోసం ప్రార్థనలు చేస్తూనే వున్నారు. ఈ ఖరీఫ్‌లో వేరుశెనగ సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా తగ్గిపోయింది. కొంత మంది రైతులు ధైర్యం చేసి అక్కడక్కడా వేరుశెనగ వేసుకున్నప్పటికీ వాటికి అవసరమైన నీటి వనరులు లేక పంటంతా ఎండుముఖం పడుతుండడంతో, కళ్లముందే ఎండిపోతున్న ఆ పంటను చూసుకుని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. జిల్లాలోని మెట్టప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా విస్తారంగా వేసుకునే మినుము పంట కూడా ఈసారి అసలు కనిపించడం లేదంటే అతిశయోక్తేమీ కాదు. ఖరీఫ్‌లో మెట్టప్రాంతాల్లో కనీసం రెండు వేల హెక్టార్లకు పైగానే మినుము సాగు చేసేవారు కానీ, ఈసారి ఎక్కడో ఓ నాలుగైదు హెక్టార్లలో మినహా, మరెక్కడా మినుము పంట కనిపించడం లేదని అధికారవర్గాలే ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మరీ ముఖ్యంగా, జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, వెంకటగిరి, గూడూరు, పొదలకూరు, రాపూరు, పొదలకూరు, బాలాయపల్లి తదితర ప్రాంతాలు వర్షాభావంతో ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. అనేక మండలాల్లో విస్తారంగా వున్న నిమ్మ తోటలు, బత్తాయి తోటలు కూడా ఎండి పోతున్నాయి. డెల్టా ప్రాంతంలోనూ వరుణుడి కరుణ లేక పోవడంతో అరటి తోటలు, ఆకుతోటలు, కూరగాయల తోటలు ఎండుముఖం పడుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఇకనైనా వెంటనే ఈ కరువు పరిస్థితులను సమీక్షించి, వెంటనే రైతాంగానికి అవసరమైన సాగు నీరు అందించేందుకు ఏర్పాట్లు చేయాలి. మోటార్లకు, బోర్లకు అవసరమైన విద్యుత్ సరఫరాను సత్వరం మెరుగు పరచాలి. పంటలకు నీటి వనరులను కల్పించడమో, లేదంటే వెంటనే ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించడమో చేయాలి. ఎలాగైనా సరే, రైతాంగానికి ఇబ్బంది లేకుండా ఖరీఫ్ పంటల సాగుకు సకల చర్యలు తీసుకోవాలి. ఒకవైపు పంటలు ఎండిపోతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, ప్రత్యామ్నాయ పంటలపై తగు అవగాహన కల్పించకపోవడం, ప్రతిసారీ ఎంత కష్టం చేసినా నష్టాలకు గురవుతున్న రైతులను ఆదుకునేందుకు అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం రైతాంగాన్ని తీవ్ర ఆవేదనకు, ఆందోళనకూ గురిచేస్తోంది. పాడిపంటలు కళకళలాడితేనే ఏ జిల్లా అయినా, కళకళలాడుతుంది. అదును దాటిపోయాక, వర్షాలు వచ్చినా చేయగలిగిందేమీ వుండదు. పంటలన్నీ ఎండిపోయాక, ఏదో కంటితుడుపు కోసం పరిహారం ఇప్పిస్తామనడంలో అర్థం లేదు. అధికార యంత్రాంగం వెంటనే కళ్ళు తెరవాలి. చిత్తశుద్ధితో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పంటపొలాలు, తోటల పరిస్థితులను, వాస్తవ స్థితిగతులను సమీక్షించి, ఎండి పోతున్న పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి. రైతులకు అవసరమైన నీటి వనరులను కల్పించాలి. విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించేందుకు, వర్షాభావంతో విలవిలలాడుతున్న అన్నదాతలను అన్నివిధాలా ఆదుకునేందుకు కృషిచేయాలి. లేదంటే, ఈసారి ఖరీఫ్‌కు కరువు కాటు తప్పదు.

## ప్రభుత్వ వైద్యకళాశాల ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం

### వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీనివాస్ వెల్లడి

నెల్లూరులో ప్రభుత్వ వైద్యకళాశాలను ఈ ఏడాదే ప్రారంభించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని వెల్లడించారు. ఈ నెల 5న నెల్లూరుకు విచ్చేసిన మంత్రి, నగరంలో కొత్తగా నిర్మించిన వైద్యకళాశాలను, డిఎస్ఆర్ ప్రభుత్వ వైద్యశాలను సందర్శించారు. ఈ వైద్యకళాశాల నిర్మాణం బావుందని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 150 సీట్లతో వైద్యకళాశాల ప్రథమ సంవత్సరం విద్యాకోర్సు ప్రారంభమయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా, ఆసుపత్రిలో పనిచేసే కాంట్రాక్ట్ సిబ్బంది మంత్రికి వినతిపత్రం సమర్పిస్తూ, తమను రెగ్యులర్ చేయాలని విన్నవించుకున్నారు. ఆ తర్వాత మంత్రి శ్రీనివాస్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిని సందర్శించారు. జిల్లాలో క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటుకు ప్రభుత్వం రూ. 40 కోట్లు వెచ్చించనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆ నిధుల్లో కొంతమొత్తాన్ని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రతినిధి దీపా వెంకట్, బిజెపి నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, ఇన్‌ఛార్జ్ డిఎంహెచ్ఓ కోటేశ్వరి, ఆసుపత్రి అధికారులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి నగరంలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి(జూబ్లీ హాస్పిటల్)ని సందర్శించి, ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు.

## జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు అందించాలి

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఏపియుడబ్ల్యుజె) ఈనెల 5న నెల్లూరుకు వచ్చిన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి డా॥కామినేని శ్రీనివాసరావును కలిసి రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఆరోగ్య పథకం అమలుకు సంబంధించి వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా యూనియన్ ఉపాధ్యక్షులు ఎ.జయప్రకాష్, జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 15వేల మంది జర్నలిస్టులు ప్రింటు, ఎలక్ట్రానిక్ మీడియాలో వివిధ స్థాయిలలో పనిచేస్తున్నారని, వారంతా వృత్తిపరంగా ఎన్నో వత్తిడులకు లోనవుతుంటారని తద్వారా ఆరోగ్యసమస్యలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో ఆరోగ్య భీమా పథకం అమలులో వున్నప్పుడు ప్రీమియంలో మూడోవంతు జర్నలిస్టులు చెల్లిస్తుండగా రెండు వంతులు ప్రభుత్వం చెల్లిస్తూ వచ్చిందని తద్వారా గత పదేళ్ళుగా అమల్లో వున్న మెడిక్లెయిమ్ ద్వారా వందలాది జర్నలిస్టులు వైద్య ఖర్చుల పరిహారం పొందగలిగారన్నారు. అయితే గత ప్రభుత్వం తామే జర్నలిస్టులకు, ఉద్యోగులకు ఇచ్చినట్లుగానే ఆరోగ్య కార్డులను మంజూరు చేస్తామన్నారని, కాని ఎన్నికల కోడ్ అమలులో ఉత్తర్వులు వెలువడలేదని దీంతో పాత పథకం రద్దయ్యి, కొత్త పథకం రాకపోవడంతో ప్రీమియం చెల్లించిన వేలాదిమంది జర్నలిస్టులు వైద్య సహాయం పొందలేకపోయారని కావున ప్రస్తుతం ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న నారా చంద్రబాబు నాయుడు చెప్పినట్టు ఆగస్టు 15లోపు ఆరోగ్యకార్డులు ఉద్యోగస్తులతో పాటు జర్నలిస్టులకు కూడా అందించి అనారోగ్యంతో నానాయాతనలు పడుతున్న జర్నలిస్టులను ఆదుకోవాలని కోరారు.

రిటైర్డు జర్నలిస్టులకు కూడా ఇది వర్తింపజేయమని అభ్యర్థించారు. దీనికి మంత్రి స్పందిస్తూ ఎన్జీఓలతో పాటు జర్నలిస్టులకు కూడా హెల్త్‌కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐజెయు జాతీయ కౌన్సిల్ సభ్యులు వి.శేషాచలపతి, ఎపియుడబ్ల్యుజె జిల్లా అడహక్ కమిటీ సభ్యులు జి.వినోద్, రాజన్, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### వైద్యశాస్త్రం కోసం...

## విశాలాక్షి ఆశ్రమవాసి మృతదేహ సమర్పణ

గొలగమూడిలోని విశాలక్షి వృద్ధులాశ్రమవాసి 83సం॥ల గుంటూరు జయలక్ష్మమ్మ, సుమారు గత మూడున్నర సంవత్సరాలుగా ఆశ్రమంలో వుంటూ వృద్ధాప్యంతో జూలై 5న మరణించారు. ఆమె అంత్యక్రియల్ని తాము చేసే అవకాశం పొందిన ఆశ్రమ నిర్వాహకులు కోసూరు రత్నం, జయలక్ష్మమ్మ కళ్లను అంధుల కోసం అందించే ప్రయత్నం జేస్తూ వారి దేహాన్ని వైద్య విజ్ఞానశాస్త్ర రంగానికి సమర్పించడానికి పినాకిని దేహసమర్పకుల సంస్థలకు తెలిపారు. "పినాకిని" వారికి సహకరించి, జయలక్ష్మమ్మ దేహాన్ని అదే రోజు నారాయణ వైద్యకళాశాలకందించింది. కళాశాల పక్షాన నారాయణ వైద్యసంస్థల కార్యనిర్వహణాధికారి సిహెచ్ భాస్కర్‌రెడ్డి జయలక్ష్మమ్మ దేహాన్నందుకొన్నారు.

ఆశ్రమంలో జీవిస్తుండిన జయలక్ష్మమ్మ నేత్రసమర్పకులవడంతో బాటు దేహసమర్పకులు కూడా అయ్యారు. ఆ భాగ్యం అయాచితంగా ఆమెను వరించింది. విశాలాక్షి ఆశ్రమవాసి రాజ్యలక్ష్మికి గత సంవత్సరం దేహసమర్పకులయ్యే భాగ్యం ఇట్లే కలిగింది.

### నిప్పులవాగును వెడల్పు చేయాలి...

## సోమశిల, కండలేరులకు నీరందించాలి

భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిడతల రమేష్ ఈనెల 7న సోమశిల జలాశయంలో తగ్గిపోతున్న నీటి గురించి ఆందోళన వ్యక్తంచేస్తూ తెలుగు గంగ ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీరుకు ఒక వినతిపత్రాన్ని అందజేసారు. పెన్నానది పరీవాహక ప్రాంతంలో నిర్మించిన సోమశిల జలాశయంలో నీటి లభ్యత ఆందోళన కలుగజేస్తోందని, సోమశిల పైప్రాంతాలలో పెన్నా ఉపనదులైన పాపాఘ్ని, సగిలేరుల నుండి గత సంవత్సరం కేవలం 1టియంసి నీరు మాత్రమే వచ్చిందని పేర్కొన్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారిత పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ నుండి నిప్పులవాగు–కుందు నదుల ద్వారా మిగులు జలాలు సోమశిలకు చేరే మార్గం తప్ప మరో గత్యంతరం లేదన్నారు. కర్నూలు జిల్లాలోని నిప్పులవాగు – గాలేరు నదుల మధ్య 14కి.మీ మేర నీటి ప్రవాహ కాలువను యుద్ధ ప్రాతిపదికన వెడల్పు చేయాల్సి వుందని తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను 4000 క్యూసెక్కుల నుండి 44000 క్యూసెక్కులకు ఆధునీకీకరించినా నిప్పులవాగు – గాలేరు – కుందు నదుల మధ్య కాలువలు వెడల్పు చేయనందున సోమశిలకు వరదనీరు 4000 క్యూసెక్కులు మాత్రమే విడుదలవుతుందని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి నిప్పుల వాగును వెడల్పుచేయాలని, ఈ జలసంవత్సరంలో సోమశిల, కండలేరు డ్యామ్‌లకు నీటిలభ్యత శాతం పెరిగేలా చూసి జిల్లాలో త్రాగు – సాగు నీటి సమస్యను నివారించాలని డిమాండ్ చేసారు.

# నెల్లూరు కబుర్లు

## వస్తున్నాడు... వెంకయ్య

♦ 19,20 తేదీలలో జిల్లాలో పర్యటన ♦



నెల్లూరు జిల్లాలో వచ్చిన ఎన్నికల ఫలితాలపై అసంతృప్తితో వున్న కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి యం.వెంకయ్య నాయుడు ఎట్టకేలకు కొంత చల్లబడ్డారు. అలకను, అసంతృప్తిని పక్కనపెట్టి తన జన్మభూమి నెల్లూరు జిల్లాకు రావడానికి సంసిద్ధమయ్యారు. ఈ నెల 19, 20తేదీలలో ఆయన జిల్లాలో జరిగే కార్యక్రమాలలో పాల్గొనసున్నారు. ఈ నెల 19వ తేదీ ఉదయం 7.20గంటలకు ఆయన రేణిగుంటకు చేరుకుంటారు. అక్కడ కొద్దిసేపు ఆగి 10గంటలకు గూడూరుకు చేరుకుంటారు. గూడూరులో ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద వున్న కోనేటి పునరుద్ధరణ పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. కనుమూరు హరిశ్చంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వారు కోటిరూపాయలతో ఈ కోనేటిని అభివృద్ధి చేయనున్నారు. అనంతరం నెల్లూరు బయలుదేరుతారు. అయ్యప్పగుడి సమీపంలో బీజేపీ కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికి అక్కడనుండి నగరంలో వరకు భారీర్యాలీ నిర్వహిస్తారు. ఆరోజు ఆయన కొన్ని అధికారిక కార్యక్రమాలలో పాల్గొంటారు. అలాగే సాయంత్రం బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారు. ఆరోజే ఆత్మీయులు, ముఖ్యులను కూడా కలుసుకునే అవకాశముంది. ఆరోజు రాత్రికి నెల్లూరులోనే బసచేస్తారు. 20వ తేదీ ఉదయం విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే అభినందన సభలో పాల్గొంటారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయన రేణిగుంటకు వెళ్ళి అక్కడ నుండి విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు.

### ఇంతకాలం దూరంగా ఇదే మొదటిసారి...

వెంకయ్యనాయుడు తన రాజకీయజీవితంలో రెండు నెలలకు పైగా నెల్లూరు వైపుకు రాకపోవడం ఇదే మొదటిసారి. గతంలో ఆయన ఎంత బిజీగా వున్నా నెలకు ఒకటి రెండుసార్లన్నా నెల్లూరుకు వచ్చేవారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌కు తప్పకుండా వెళ్లేవాడు. వాజ్‌పేయి ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు కూడా నెల్లూరుకు ఠంచన్‌గా వచ్చేవాడు. ముఖ్యంగా ప్రతి సంవత్సరం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నిర్వహించే ప్రతిభకు ప్రోత్సాహం కార్యక్రమంలో తప్పకుండా పాల్గొనేవాడు. కాని ఈ సంవత్సరం ఆయన ఆ కార్యక్రమానికి కూడా రాలేదు. నెల్లూరుకు ఇన్ని రోజులు దూరంగా ఉండటమనేది ఆయన బలవంతంగా తీసుకున్న నిర్ణయం. అమ్మ మీద, అన్నం మీద ఎల్లకాలం అలగలేరుగా! వెంకయ్య అలక కూడా అంతే. అలక, అసంతృప్తిని వదిలి తన తల్లి లాంటి నెల్లూరుకు వస్తున్నాడు.

## నెల్లూరులో కామినేని

నెల్లూరులో అధికారిక పర్యటనకు వచ్చిన రెండో మంత్రిగా కామినేని శ్రీనివాస్ గుర్తింపు పొందారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డాక ఇంతవరకు ఇద్దరు మంత్రులే జిల్లాకు వచ్చారు. వారిలో ఒకరు ఈ జిల్లాకు చెందిన మున్సిపల్ మంత్రి నారాయణ. ఆయన సొంత జిల్లాకు రావడం సహజమే. ఇక 5వ తేదీ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ నెల్లూరొచ్చారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే నెల్లూరులో జరిగిన అధికారిక కార్యక్రమాలలో కూడా పాల్గొన్నారు.

## గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోండి

జిల్లాలో గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఎఐఎస్ఎఫ్ నాయకులు ఆర్ఐఒకు ఇటీవల వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లాలో అనేక ప్రైవేట్ కళాశాలలు తగిన ప్రభుత్వ గుర్తింపు లేకుండా విద్యార్థులను మోసగిస్తున్నాయని వారు ఆరోపించారు. విద్యార్థులకు కనీస వసతులు కల్పించకుండా, విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఆదినారాయణ, ఆ విద్యార్థి సంఘం నాయకులు సునీల్, సంజీవి, బాలు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు ఆర్టీసి జోన్ ఇ.డి గా కోటేశ్వరరావు

నెల్లూరు ఆర్టీసి జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎ.కోటేశ్వరరావు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ ఇ.డిగా పనిచేస్తున్నారు. ఆయన గతంలో గూడూరు డివిజనల్ మేనేజర్‌గా, నెల్లూరు రీజనల్ మేనేజర్‌గా, కడప ఇ.డిగా కూడా పనిచేసివున్నారు. ఈ నేపథ్యంలో, ఆయన అటు కడప, ఇటు నెల్లూరు ఆర్టీసి జోన్ ఇ.డిగా నియమితులయ్యారు. కొత్తగా ఇక్కడ ఇ.డిగా బాధ్యతలు చేపట్టనున్న ఆయనకు 'లాయర్' అభినందనలు.

## లెజెండ్ శతదినోత్సవ సంబరాలు

ప్రముఖ సినీనటుడు బాలకృష్ణ నటించిన లెజెండ్ సినిమా శతదినోత్సవ సంబరాలను నెల్లూరులోని బాలకృష్ణ అభిమాన సంఘం గౌరవాధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో ఈ నెల 5న నర్తకి థియేటర్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి, బాణసంచా వేడుకలు నిర్వహించి, అనంతరం పేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి జలదంకి సుధాకర్, థియేటర్ మేనేజర్ శ్రీనివాసులుతో పాటు బాలకృష్ణ అభిమానులు పోతయ్య, మార్కెట్ శ్రీను, భాస్కరనాయుడు, శ్రీనివాసులునాయుడు, విజయ్‌నాయుడు, శింగంశెట్టి రవిచంద్ర, గంగాధర్, అలీ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బొల్లినేనికి రెడ్‌క్రాస్ రక్తనిధి అనుమతి

ఆరోగ్యశ్రీ, ఉద్యోగశ్రీ అనుమతులు వున్న ఆసుపత్రులకు తప్పనిసరిగా రక్తనిధి అనుమతులు తీసుకోవాలని రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ పేర్కొన్నారు. ఆ మేరకు నగరంలోని బొల్లినేని సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలకు మంగళవారం రక్తనిధి అనుమతులను మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## సిమెంట్ ధరల పెంపుపై నిరసన

మన రాష్ట్రంలో సిమెంట్ కంపెనీలన్నీ సిండికేట్‌గా ఏర్పడి కృత్రిమ కొరత సృష్టించి ఒక్క నెలలోపల సుమారు 50% పెంచడం చాలా అన్యాయమని పేర్కొంటూ, ఎటువంటి ఉత్పత్తికి సంబంధించిన ముడిసరుకైనా ఒక్క నెలలో 50% పెరగడం ఎటువంటి పరిస్థితులలోనూ జరిగే అవకాశంలేదని కావున బిల్డర్లు మరియు భవన నిర్మాణదారులు అందరు ఏకమై ఈనెల 5వతేదీ నుండి 12వతేదీ వరకు సిమెంట్ కొనుగోలును ఆపివేయమని క్రెడాయ్ (కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) నిర్ణయించిన పిలుపు మేరకు నెల్లూరు బిల్డర్స్ అసోసియేషన్ తరపున క్రెడాయ్ నెల్లూరు ఛైర్మెన్ పి.వి.రాఘవరావు, అధ్యక్షుడు దండే రామకృష్ణ బిల్డర్స్ నెల్లూరు బిల్డర్స్‌కు మరియు భవన నిర్మాతలకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు టి.నరేంద్రరెడ్డి, కార్యదర్శి, ఉపకార్యదర్శులు సి.హెచ్.శ్రీధరరాజు, కృష్ణారెడ్డి, శివకుమార్, కోశాధికారి యం.సుధాకర్‌రెడ్డి మరియు గ్రీవెన్స్ కమిటీ ఛైర్మెన్ జి.గోపాల్ పాల్గొన్నారు.

## పలకరించిన వాన

జిల్లాలో గత రెండు నెలల నుంచి సూర్యతాపం పెరిగిపోయి, భానుడి భగభగలతో అట్టుడికిపోతున్న పరిస్థితుల్లో గత ఆదివారం చిరుజల్లులు పలకరించాయి. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో చల్లని వాతావరణం ఏర్పడి, ప్రజలకు కొంత ఉపశమనం ఏర్పడింది. ఆదివారం ఒక్కరోజు జిల్లాలోని పలు మండలాల్లో మొత్తంగా కురిసిన వర్షపాతం 23.4మిల్లీమీటర్లుగా నమోదైంది. దీంతో, ఈ సీజన్‌లో వానలు కురుస్తాయని రైతులు ఆశతో వున్నారు. పదునైన వానలు కురిస్తే తప్ప ఖరీఫ్ పంటలు గట్టెక్కే పరిస్థితి లేదు. అందుకే వరుణుడి కరుణ కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



ఈ నెల 7న హైదరాబాద్‌లో వైయస్సార్సీపీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసిన నెల్లూరు మేయర్ షేక్ అబ్దుల్ అజీజ్, కార్పొరేటర్ అబ్దుల్ జలీల్

## ఘనంగా రోశయ్య పుట్టినరోజు వేడుకలు



తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్ కొణిజేటి రోశయ్య 82వ పుట్టినరోజు వేడుకలు చెన్నై రాజ్‌భవన్ దర్బారు హాలులో ఈనెల 4న వైభవంగా జరిగాయి. మిత్రుడు కె.వి.చలమయ్య గులాబీ పూల మాలతో, శాలువాతో సత్కరించగా పెంచలకోన, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వేదపండితులచే ఆశీర్వదించగా జొన్నవాడ కామాక్షితాయి మల్లికార్జునస్వామి వారి దేవస్థానం, శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం, శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానాల వారి తీర్థప్రసాదములు ఇచ్చి వేదపండితులు ఆశీర్వదించారు. పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మెన్ అమరా శ్రీరాములు, తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం మాజీ ఛైర్మెన్ పత్తిరవీంద్రబాబు, శ్రీశైలభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం ఛైర్మెన్, ఆల్తూరి ఆదినారాయణరెడ్డి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి మిత్రులు, శ్రేయోభిలాషులు, ఎ.పి. హ్యూమన్ రైట్స్ సభ్యులు కాకుమాని పెద్దిరెడ్డి, కృష్ణగిరి పార్లమెంటు సభ్యులు నరసింహన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు ఇమ్మడిశెట్టి కోటేశ్వరరావు, అమరవాది లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కోట సత్యనారాయణ, తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఎమ్.వి.నారాయణగుప్తా, తమిళనాడు మంత్రులు, శాసనసభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కురుగొండ్లను శిక్షించాలి

- జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్



జిల్లా సచివాలయం ముందు ఈనెల 7న జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లరిబ్బన్లు ధరించి జిల్లా పాలనాధికారి పట్ల వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దురుసు ప్రవర్తనను నిరసిస్తూ ధర్నా చేసారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌రావు మాట్లాడుతూ విధుల్లో వున్న జిల్లా పాలనాధికారిపైనే వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ ఎన్నికల సమయంలో సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించడం గర్హనీయమని, ఒక జిల్లా అత్యున్నత అధికారికే రక్షణ లేకపోతే తమలాంటి సామాన్య ఉద్యోగుల స్థితి ఎలా వుంటుందో ఊహించడానికే భయమేస్తుందని అన్నారు. వెంటనే ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను అరెస్టు చేయాలని, ఏ పార్టీ నాయకులైనా ఎన్నికల విధుల్లో పనిచేసే ఉద్యోగులపై ఇలా దురుసుగా వ్యవహరించడం సహేతుకం కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు షఫీమాలిక్, కాయిల సతీష్‌కుమార్, శ్రీరామకృష్ణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సూక్ష్మకళాకారుడు ముసవ్విర్‌కు తోడ్పాటు

నెల్లూరు జెండావీధిలో నివసించే సూక్ష్మకళాకారుడు షేక్ ముసవ్విర్‌కు ఈనెల 7న అమీర్‌జాన్ అకాడమీ తరపున జి.వి.కృష్ణారెడ్డి రూ॥8,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ముసవ్విర్ అనారోగ్యంతో బాధపడుతూ గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులెదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా జి.వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ దాతలు, ఈ సూక్ష్మ కళాకారునికి తమ తోడ్పాటునందించాలని, ప్రభుత్వం ఆయనకు ఇంటిస్థలం, కళాకారులకు ఇచ్చే పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అమీర్‌జాన్ అకాడమీ కార్యదర్శి, చిత్రకారుడు అమీర్ తదితరులు పాల్గొన్నారు.

# దుగరాజపట్నం పోర్ట్... హుష్‌కాకి?



## ఇది కూడా పోతే.... అన్నింటా జిల్లాకు మొండిచేయే!

**మొన్నటి ఎన్నికల ఫలితాలు జిల్లాకు శాపంగా మారుతున్నాయి. రాష్ట్రమంతటా తెలుగుదేశంకు అనుకూలంగా ఫలితాలు వచ్చి, నెల్లూరుజిల్లాలో మాత్రం వ్యతిరేకంగా రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ కసిని ఈ జిల్లాపై తీర్చుకుంటోంది. ఈ జిల్లా అభివృద్ధిపై సవతి ప్రేమనే చూపిస్తోంది.**

రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడ్డ 13జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ కోణంలో గుంటూరు – విజయవాడ మధ్య రాజధాని, విశాఖలో ఐటి, సినీ పరిశ్రమ, అనంతలో నాలెడ్జ్ హబ్, తిరుపతిలో జాతీయ విద్యాకేంద్రాలు వంటివి నెలకొల్పాలనుకుంటున్నారు. ఈ అభివృద్ధి వికేంద్రీకరణలో నెల్లూరుజిల్లాను మాత్రం ప్రస్థావించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు మంజూరైన ఒకటి అరా ప్రాజెక్ట్‌లను కూడా ఇప్పుడు వేరే ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో దుగరాజపట్నం ఒకటి.

గత యూపిఏ ప్రభుత్వంలోనే వాకాడు మండలం దుగరాజపట్నం వద్ద పోర్టు మంజూరైంది. కేంద్రప్రభుత్వం నిర్మించతలపెట్టిన అతిపెద్ద ఓడరేవు ఇది. దాదాపు 9వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా! రాష్ట్రంలో ఈ పోర్టు నిర్మాణానికి విశాఖ జిల్లా నక్కలపల్లి, ప్రకాశం జిల్లా రామాయపట్నం, నెల్లూరుజిల్లా దుగరాజపట్నంలను పరిశీలించారు. దుగరాజపట్నం వద్ద పోర్టు నిర్మాణానికి షార్‌సెంటర్ వాళ్లు అభ్యంతరం పెట్టారు. అలాగే పర్యావరణ అనుమతులు కూడా అడ్డంకిగా మారాయి. అయితే మాజీ తిరుపతి ఎంపీ చింతా మోహన్ గట్టి ప్రయత్నాలు చేయడంతో యూపిఏ ప్రభుత్వం వీటిని అధిగమించి దుగరాజపట్నం వద్దే పోర్టు మంజూరు చేసింది. దీనికి గెజిట్‌నోట్‌ను కూడా విడుదలచేసింది. మొన్న ఎన్నికలకు ముందే ఈ పోర్టుకు ప్రధాని చేత శంకుస్థాపన చేయించాలని చింతా ప్రయత్నించాడు కాని సఫలం కాలేకపోయాడు.

ఇప్పుడు మళ్ళీ దుగరాజపట్నం పోర్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఒకే జిల్లాలో రెండుపోర్టులు అవసరమా? అనే అంశాన్ని లేవనెత్తుతున్నారు. జిల్లాలో ఇప్పటికే ఒక పోర్టు వుంది. రెండోపోర్టు వస్తే కృష్ణపట్నం పోర్టుకు వ్యాపారం తగ్గిపోతుందనేది ఒక వాదన. ఇక తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఓ వర్గమైతే ఈ పోర్టును నెల్లూరుజిల్లా నుండి ప్రకాశం జిల్లా రామాయపట్నంకు మార్చేందుకు పెద్ద ఎత్తునే ప్రయత్నాలు చేస్తోంది. గతంలో షార్ అభ్యంతరాలు, పర్యావరణ అనుమతులను అందుకు కారణంగా చూపుతుంది.

### వెంకయ్య శ్రద్ధ పెడితేనే...

జిల్లాకు మంజూరైన దుగరాజపట్నం పోర్టును నిలపగల శక్తి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుకు మాత్రమేవుంది. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి పోర్టు నిర్మాణం ఎంతో అవసరం. దేశంలోనే అతిపెద్ద పోర్టు మన జిల్లాలో ఉందంటే భవిష్యత్‌లో జిల్లా అభివృద్ధికి అదెంతగానో దోహదపడుతుంది. ఈ జిల్లాలో వచ్చిన ఫలితాల పట్ల వెంకయ్య అసంతృప్తితో వున్నారని ప్రజలు ఇప్పటికే గ్రహించారు. అందుకే ఆయన నెల్లూరు రాలేదనుకుంటున్నారు. జిల్లా నుండి ఈ పోర్టు వెళ్లిపోతే వెంకయ్య ఈ జిల్లా మీదున్న కోపంతో ప్రయత్నం చేయకపోబట్టే ఆ పోర్టు వెళ్లిపోయిందని ప్రజలు భావించే అవకాశం కూడా వుంది.

# స్వర్ణభారత్ వైద్యసేవలు అభినందనీయం



సభలో మాట్లాడుతున్న మంత్రి కామినేని శ్రీనివాస్

గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ చేస్తున్న సేవలు ఎంతైనా అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ కొనియాడారు.

ఈ నెల 5న మంత్రి శ్రీనివాస్ వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌ను సందర్శించి, ఈ ట్రస్ట్‌లో హైదరాబాద్‌లోని స్టార్ ఆసుపత్రి, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, నారాయణ దంతవైద్య కళాశాల వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. పల్లె ప్రజలకు మెరుగైన వైద్యసేవలను ఉచితంగా అందిం చేందుకు స్వర్ణభారత్ ట్రస్ట్‌వారు ప్రతినెలా ఇలాంటి వైద్యశిబిరాలు నిర్వహించడం ఆదర్శనీయమన్నారు. ప్రతి జిల్లాలోనూ ఇలాంటి సేవాసంస్థలు ఏర్పాటుచేస్తే ప్రజలకు వైద్యసేవలు మరింత అందుబాటులోకి వస్తాయని ఆయన ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంధసంస్థలు కూడా భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ మాట్లాడుతూ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం వ్యయభారంగా మారిన పరిస్థితుల్లో, గ్రామీణులు మంచి వైద్యం కోసం అధిక వ్యయప్రయాసలకు గురవుతున్నారని, గ్రామీణులకు మంచి వైద్యం అందించాలనే లక్ష్యంతో ట్రస్ట్ సేవలు అందిస్తోందని అన్నారు. ఇందులో భాగంగా గత పదమూడేళ్ళుగా ఉచిత వైద్యశిబరాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో అనేకమంది పాల్గొని ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకున్నారు.

ఈ కార్యక్రమంలో స్టార్ ఆసుపత్రి అధినేత మన్నెం గోపీచంద్, ప్రముఖ వైద్యులు నవీన్‌కృష్ణ, సాయిసుదర్శన్, ట్రస్ట్ సభ్యులు హరికుమార్‌రెడ్డి, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణంపై మహిళా సమరం!







*ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే పాలకులు. వారే దేవుళ్లు. వారి ఆజ్ఞలు, అభిప్రాయాలనే ప్రభుత్వాలు అమలు చేయాలి. వారి సంక్షేమానికే కృషి చేయాలి. కొన్ని సందర్భాలలో అలా జరగడంలేదు. పాలకుల నుండి అధికారుల వరకు కూడా అంతా మా ఇష్టం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సామాన్య జనం ఎంతగా మొత్తుకుంటున్నా వారి సమస్యను చెవికెక్కించుకోవడం లేదు. అలాంటిదే ఇది.*

నెల్లూరు మినీబైపాస్ రోడ్డులో వనంతోపు సెంటర్‌లో ఓ వైన్‌షాపు వుంది. దీనిని అక్కడనుండి వంద అడుగుల దూరం జరపాలని స్థానిక ప్రజలు, మహిళలు 2009 సంవత్సరం నుండి ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. 2014లో మహిళా సంక్షేమాన్ని కాంక్షించే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక కూడా వారి కోరిక తీరడంలేదు. సాక్షాత్తు భగవంతుడే దిగొచ్చినా ఆ వైన్‌షాపును కొంచెం అవతలకు జరపలేనంత బలంగా రాజకీయ శక్తులు అడ్డుగా నిలుస్తున్నాయి. రోడ్డు మార్జిన్ స్థలంలో ఓ ఎక్సైజ్ అధికారి కట్టిన భవనంలో 2009 నుండి ఇక్కడ వైన్‌షాపు నడుపుతున్నారు. ఎక్సైజ్‌శాఖ గెజిట్ నోట్‌లో కొండాయపాలెం సెంటర్‌లో వైన్‌షాపు అని వున్నా వీళ్లు వనంతోపు సెంటర్‌నే కొండాయపాలెం సెంటర్‌గా చూపిస్తూ వైన్‌షాపు నడుపుతున్నారు. కూడలిలో వున్న ఈ వైన్‌షాపు వల్ల నిత్యం స్థానికులు, మహిళలు ఎదుర్కొనే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వనంతోపు సెంటర్, స్నేహనగర్ ప్రాంతాలకు వెళ్ళే మహిళలు ఇక్కడే ఆటోలు, టౌన్‌బస్సులు దిగి నడిచిపోతుంటారు. ఇక్కడ రోడ్ల మీదే మందుబాబుల ఆగడాలు మితిమీరుతుండడంతో మహిళలు ఆ దారిన పోవాలంటేనే భయపడుతున్నారు. ఈ వైన్‌షాపుకు పర్మిట్ రూం వుంది. దానినే బార్‌గా వాడుతున్నారు. ఈ వైన్‌షాపు వెనుక నివాసాలు వున్నాయి. ఇటీవల కొందరు మందుబాబులు మిద్దెపై నిలబడి క్రింద ఇళ్లలో వున్న అమ్మాయిలను తమ సెల్‌ఫోన్‌లలో ఫోటోలు తీసారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై బీరు బాటిళ్లు విసిరారు. ఈ సెంటర్‌లో తప్పతాగి కొందరు అమ్మాయిల వెంటపడి వేధించిన సంఘటనలు కూడా ఉన్నాయి. మందు బాబులు మద్యం మత్తులో భవనంపై నుండే మూత్రం పోయడం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చైన్‌స్నాచింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ వైన్‌షాపుకు సమీపంలోనే మూడు విద్యాలయాలు, రెండు దేవాలయాలున్నాయి.

ఈ ప్రాంతం నుండి వైన్‌షాపును పక్కకు తరలించాలని స్థానికులు ఆందోళనలు చేస్తున్నారు. ఈమేరకు జిల్లా కలెక్టర్‌ను, ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్‌ను కలిసి వినతిపత్రాలు కూడా సమర్పించారు. ఎక్సైజ్ శాఖాధికారులలో మాత్రం చలనం లేదు. మద్యంషాపులను మనుషులుండే చోట కాకుండా అడవుల్లో పెట్టుకోవంటారా అన్నట్లుంది వారి వాలకం.

జిల్లా కలెక్టర్ మాత్రం స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రహించినట్లుంది. ఆయన మనసు పెడితే ఈ వైన్‌షాపును కొంత దూరం జరపడం పెద్ద సమస్య కాదు. ఎంతో కాలంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యను పరిష్కరించిన పెద్ద మనిషవుతారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

శ్రీ షిర్డి సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవ ఆహ్వానము

నెల్లూరు శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవాలు

తేది.12-07-2014 శనివారము నుండి తేది. 20-07-2014 ఆదివారము వరకు జరుగును.

ప్రతి రోజూ ఉదయం 7-30గం.ల నుండి బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకములు, సహస్రనామ పూజలు జరుగును. పై పూజలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా వద్ద 75రూ/- చెల్లించవలసినదిగా మనవి. గమనిక - పై దినములలో ప్రతిరోజూ షిర్డి హారతులు జరుగును.

సాంస్కృతిక కార్యక్రమములు: తేది.12-07-14 శనివారం నుండి 19-07-14 శనివారం వరకు ప్రతిరోజు సా॥6.30 గంటలకు కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆవరణలో తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవములలో వ్యాఖ్యాతలు డా॥ మైలవరపు శ్రీనివాసరావుచే రామయణంలోని సుందరకాండ దాని అంతరార్థము ఉపన్యాస మహాయజ్ఞం జరుగును.

నగరోత్సవం: తేది.17-07-2014 మంగళవారం సా॥6.00గం.లకు మేళతాళాలు, విశేష పుష్పాలంకరణ, బాణాసంచా వేడుకలతో శ్రీ బాబావారి నగరోత్సవం అతి వైభవంగా జరుగును.

అన్నదానం : తేది.20-07-2014 ఆదివారము మధ్యాహ్నం 11.00గం.ల నుండి భక్తులకు అన్నదానం జరుగును.

కార్యవర్గము | శ్రీ షిర్డి సాయిబాబా మందిరం | గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్. 2327771

గల్పిక

# వరుణదేవుడు Vs చంద్రబాబునాయుడు

అది తెలంగాణ సీఎం కేసీఆర్ దయాదాక్షిణ్యాలతో ఆంధ్ర సీఎం, మంత్రులు ఉంటున్న భాగ్యనగరం. ఆ నగరంలో ఆంధ్రా ముఖ్యమంత్రికి, మంత్రులకు కేటాయించిన హెచ్-బ్లాక్. ఆంధ్రులను అక్కడంతా అంటరానివారిగా చూస్తున్నట్లు ఆ బ్లాక్ వరకు ప్రత్యేకంగా బారికేడ్లు కట్టేసారు. ఆ బ్లాక్‌లోని తన ఛాంబర్‌లో హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు దిగాలుగా కూర్చుని వున్నారు. ఆయన ఏదో హెలికాప్టర్ పోతున్న సౌండ్ రావడంతో తలపైకెత్తి చూసాడు. ఆ గదిలో స్లాబుకున్న సీలింగ్ ఫ్యాన్ హెలికాప్టర్ పోతున్న సౌండ్‌తో తిరుగుతుంది. ఖైతాన్ ఫ్యాన్ల కంపెనీ మొదట ఉత్పత్తి చేసిన వంద ఫ్యాన్లలో అదొకటి లాగుంది. దాని వాలకం చూస్తే ఎప్పుడైనా వూడి నెత్తిన పడొచ్చు అన్నట్లుగా వుంది. ఇక స్లాబు పెచ్చులు లేచి పడడానికి రెడీగా వుంది. గోడలు చూస్తే సినిమాహాళ్లలో బాత్‌రూంల కంటే అధ్వాన్నంగా వున్నాయి. గోడల మీదంతా పిచ్చి రాతలే... 'ఐలవ్‌యు మందాకిని', 'అమలాపురం సరోజ - భీమవరం బాలు'... ఇలా రకరకాల రాతలు. వాటిని చూస్తూ చంద్రబాబు ఆందోళనకు గురయ్యాడు. అంతలో అక్కడకు ఎంపీలు సుజనా చౌదరి, కంభంపాటి రామ్మోహన్‌రావు, సీఎం రమేష్, ఎన్.శివప్రసాద్, మంత్రులు పి.నారాయణ, ఎన్.చినరాజప్ప, కె.ఇ.కృష్ణమూర్తి, పత్తిపాటి పుల్లారావు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డిలు వచ్చారు. దిగాలుగా వున్న చంద్రబాబును చూసి ఎందుకలా వున్నారని అడిగారు. ఏం నా ఖర్మో గాని... నేను మళ్లీ సీఎం అయ్యేనాటికి రాష్ట్రం ఈ విధంగా తగలబడింది. మన ఛాంబర్‌లు చూసారా... చర్లపల్లి జైలులో ఖైదీలకు ఇంతకన్నా మంచి గదులుంటాయి. ఇక కరువొచ్చే కాలానికి నేను సీఎంను అవుతున్నానో, లేక నేను సీఎం అయ్యాక కరువొస్తుందో అర్థం కావడం లేదు. అసలే విభజనతో ఆర్థికలోటు... పైగా ఋణమాఫీ ఒకటి. గోటి చుట్టూ మీద రోకటి పోటులా ఇప్పుడు వర్షాభావ మొకటి. అసలు నేను సీఎం అయితేనే ఎందుకు వర్షాలు రావడం లేదు. ఎండలు ఎందుకిలా మండిపోతున్నాయి. నాకిప్పుడే కారణం తెలియాలి అన్నాడు. అప్పుడు దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యరావు... సార్, మేం వర్షాల కోసం చేయని ప్రయత్నమంటూ లేదు, గంగమ్మ పొంగళ్లు పెట్టాం, కప్పల పెళ్లిళ్లు చేసాం, వాటిచేత కాపురం కూడా చేయించాం. అయినా వర్షాలు కురవడం లేదంటే దరిద్రం బలంగా వున్నట్లుందన్నాడు. అప్పుడు చంద్రబాబు... నేనొచ్చినప్పుడే వర్షాలు రావడం లేదంటే దీని వెనుక ఏదో కుట్ర ఉంది. ఎవరో కావాలనే ఇది చేస్తున్నారు. అది తెలుసుకునేదెట్లా అని పెద్దగా అరిచాడు. వెంటనే సీఎం రమేష్... సార్, నల్లమల అడవుల్లో నాకు తెలిసిన పాచిపళ్ల గోచీబాబా ఒకరున్నారు. ఆయన వద్దకు వెళితే కారణం తెలుస్తుందన్నాడు. వెంటనే అందరూ కార్లలో శ్రీశైలం బాటపట్టారు. శ్రీశైలం డ్యాం దాటాక సీఎం రమేష్ అక్కడ కార్లన్నింటిని ఆపేసాడు. చంద్రబాబు సహా అందరూ దిగారు. ఆ అడవిలో కాలి బాట పట్టారు. రాళ్లు రప్పలు దాటుకుంటూ ముళ్లు ఏరుకుంటూ దాదాపు పదికిలోమీటర్లు నడిచి గోచీబాబా ఆశ్రమం వద్దకు చేరుకున్నారు. ఆశ్రమం ముందే మంచి రోడ్డు వుంది. కార్లు రయ్ మంటూ పోతున్నాయి. అది చూసి చంద్రబాబు, మిగతా వాళ్లు... అదేంటి రమేష్, ఆశ్రమం దాకా రోడ్డుంటే కొండల్లో గుట్టల్లో నడిపించుకుంటూ తీసుకొచ్చావ్, హాయిగా కార్లలో వచ్చేవాళ్లం కదా అని అడిగాడు. దానికి రమేష్, మీరు సినిమాలలో చూడలేదా... స్పెషల్ ఎఫెక్ట్ రావాలంటే ఈ మాత్రం నడవాల్సిందే... అప్పుడే కిక్కు, బాబా వద్దకు వచ్చిన ఫలితం దక్కుతుంది అని చెప్పాడు. తర్వాత అందరూ గోచీబాబా వద్ద కూర్చున్నారు. ఏంటి నాయనా మీ సమస్య అని బాబా అడిగాడు. చంద్రబాబు... నేను సీఎం అయితే వర్షాలు కురవడం లేదు స్వామి... ఇప్పుడు కూడా అంతే. ఈ ఎండలు నా కోసమే కాస్తున్నట్లుగా ఉన్నాయన్నాడు. వెంటనే బాబా కళ్లు మూసుకున్నాడు. తన మనోనేత్రంతో జరిగిపోయిన కాలాన్ని చూసాడు. తర్వాత కళ్లు తెరచి... వరుణదేవుడికి నువ్వంటే పడడం లేదు నాయనా అని చెప్పాడు. ఆ మాటకు చంద్రబాబుకు తల తిరిగినంత పనైంది. నాతో జగన్‌కు, కేసీఆర్‌కు పడడం లేదంటే అర్థముంది. వరుణ దేవుడికి నాతో పడకపోవడమేంటి... మేమిద్దరం రాజకీయశత్రువులం కామే, ఆయన కుర్చీని నేను లాక్కోలేదే... ఆయన సీటో, మంత్రిపదవో అడిగితే నేను ఎగ్గొట్టింది కూడా లేదే... మరి ఆయనకు నా మీద కోపమెందుకని ప్రశ్నించాడు. అప్పుడు గోచీబాబా తన అరచేతిలో అంజనం వేసాడు. ఆయన చేతిలో కొన్ని దృశ్యాలు కనిపించసాగాయి.

★★★★★

చంద్రగిరి రాజ్య యువరాజు చంద్రసేనుడు(ఈ జన్మలో చంద్రబాబు) సకల విద్యలలో ఆరితేరాడు. ఆయనలోని టాలెంట్ గురించి తెలిసి మైసూరు సంస్థాన యువరాణి మంగళవతి ముగ్ధురాలయ్యింది. పెళ్లంటూ చేసుకుంటే ఇలాంటి అరవీరభయంకర వీరుడినే చేసుకోవాలని మనసులో బలంగా ఫిక్సయ్యింది. ఒకరోజు యువరాజు అడవిపందుల వేటకు వెళ్లారు. అదే సమయంలో యువరాణి మంగళవతి కూడా గుర్రంపై అడవులలోకి ఆహ్లాదానికి వచ్చింది. అడవిలోనే ఒకర్నొకరు చూసుకున్నారు. తొలిచూపులోనే ప్రేమ వికసించి పండిపోయింది. దీంతో ప్రతిరోజూ యువరాజు, యువరాణి వేట, వినోదం పేరుతో అక్కడకు వచ్చి కలుసుకునే వారు. ఒకరోజు యువరాజు చంద్రసేనుడు తన పెంపుడు పావురం ద్వారా యువరాణికి ఓ ప్రేమలేఖ పంపారు.

**ఓ ప్రియా,**<br>
**నీ కోసం ఎండనైనా ఎదిరిస్తా...**<br>
**వాననైనా చీలుస్తా**<br>
**నువ్వొస్తానంటే గాల్లోనైనా నడిచొస్తా...**<br>
**నువ్వు కావాలంటే మేఘాలనైనా బంధించి ఇస్తా...**<br>
**హోరుమంటూ గాలి వీచినా**<br>
**జోరుగా వర్షం కురిసినా**<br>
**ఒళ్లు పగిలేలా ఎండకాసినా**<br>
**నీ కోసం నేను పరుగెత్తుకుంటూ వస్తా...**

అని కవిత రాసి... రేపు సాయంత్రం 4గంటలకు ఎప్పుడూ మనం కలిసే చోటే కలుసుకుంటాం... ఇది నీ మీద ఒట్టు... ఇది తప్పితే నీ ఇష్టం వచ్చిన దాంతో కొట్టు... అని వ్రాసి పంపాడు. పావురం ఇండియన్ పోస్ట్‌మెన్ కంటే మిన్నగా ఆ లేఖను యువరాణి మంగళ వతికి చేర్చింది. అది చదివిన మంగళవతి మనసు గాల్లో తేలిపోసాగింది. చీకటి పడదేమీ, ఇంకా సూర్యుడు రాడేమీ, మధ్యాహ్నం కాదేమీ... అని ఎదురుచూడసాగింది.

పక్కరోజు మధ్యాహ్నం 3గంటలకల్లా యువరాణి బయల్దేరింది. వెంటనే భోరున వర్షం మొదలైంది. కాని యువరాణి లెక్కచేయకుండా ఆ వానలోనే లవ్‌స్పాట్ వద్దకు చేరుకుంది. కాని చంద్రసేనుడు వానకు వణికిపోసాగాడు. ఆయన గుర్రం కూడా చలికి వణకసాగింది. చంద్రసేనుడు ఓ సత్రంలో తలదాచుకున్నాడు. ఓ రెండుగంటలపాటు అలాగే వాన కురవడంతో చంద్రసేనుడు మార్గం మధ్యలోనే ఉండిపోగా, మంగళవతి మాత్రం ఆ వానలోనే తడుస్తూ... అప్పుడే వచ్చిన వరద ప్రవాహంలో కొట్టుకుపోసాగింది. అప్పుడామె బాధతో... ఓ వరుణ దేవా... నీ మూలంగానే నా చంద్రసేనుడిని నేను కలుసుకోలేక పోయాను... నా ప్రేమకు విరోధివి నీవు. ఈ జన్మలోనే కాదు, ఏ జన్మలోనూ నీ నీడ నా చంద్రసేనుడిపై పడకూడదు. ఇదే నా శాపం అంటూ వరద ప్రవాహంలోనే నీళ్లను దోసిట్లోకి తీసుకుని వానపై చల్లింది. అది చూసి వరుణదేవుడికి కోపం వచ్చింది. వీళ్ల లవ్‌స్టోరీకి నేను బాధ్యుడినా... మంగళవతికి వ్రాసిన ప్రేమలేఖలో పొడుస్తాను, చీలుస్తాను అని వీరత్వం చూపిన చంద్రసేనుడు వానకు భయపడి రాకపోబట్టే ఈరోజు మంగళవతి ప్రేమ విఫల మైంది. కాబట్టి ఆమె పెట్టిన శాపం కొద్దీ నేను ఇక చంద్రసేనుడికి దూరంగానే వుంటానని వరుణ దేవుడు నిర్ణయించుకున్నాడు.

★★★★★

ఇక్కడితో దృశ్యాలు అయిపోయాయి. చంద్రబాబు ఆశ్చర్యంగా... నా పూర్వజన్మ ఇంత ఘనంగా ఉంటుందనుకోలేదు. అయినా ఇప్పుడు తరుణోపాయమేంటని అడిగాడు. బాబా వుండి... ఆ మంగళవతి కూడా ఈ జన్మలో ఎక్కడో చోట పుట్టే వుంటుంది. ఆమెను వెదికి పట్టుకుని గత జన్మలో విఫలమైన ప్రేమను ఈ జన్మలో సఫలం చేయడమేనన్నాడు. ఆమెను గుర్తించడం ఎలా అని పత్తిపాటి పుల్లారావు అడిగాడు. దానికి బాబా... అనుమానమొచ్చిన అమ్మాయి చేతినల్లా బాబు టచ్ చేయాలి... ఎవరి చేయి తాకినప్పుడు కరెంట్ షాక్ కొట్టినట్లు అనిపిస్తుందో ఆమే మంగళవతి అని చెప్పాడు. అప్పటిదాకా మౌనంగా వున్న కంభంపాటి రామ్మోహన్‌రావు... ఇదేమన్నా రాజమౌళి 'మగధీర' సినిమా అనుకుంటున్నావా... కనిపించిన ఆడపిల్లల చేతులు తాకితే నిర్భయ చట్టం క్రింద బొక్కలో తోస్తారు. వర్షాలు పడ్డప్పుడే పడతాయి. మంత్రాలకు చింతకాయలు రాలవు... బాబాలు చెబితే వర్షాలు కురవవు... లేవండి... మన టైం బాగుంటే వర్షాలు అవే పడతాయని అందరినీ లేవదీసాడు.

★★★★★


## కదంబం

### పెన్నా తీరాన!

- గుర్రాల రమణయ్య
నెల్లూరు. 99639 21943

పెన్నా<br>
నీ చిరునవ్వుల హెన్నా<br>
నా గుండెలకు పూసుకున్నా<br>
ఇప్పుడు<br>
జీవితమంతా ఎరుపే<br>
నీ గలగల గీతాల లయ<br>
కలంలో నింపుకొని<br>
ఎన్ని కవితలకు ఊపిరిపోశానో<br>
పచ్చటి చేలలో<br>
పాటకచ్చేరీలా<br>
మడవల్లో పారే నీ పాటని<br>
పలవరించిన కవిని నేను<br>
చినుకులజల్లులో తడుస్తూ<br>
కొంగ్రొత్త ఉత్సాహంతో<br>
నువ్వు పరుగులెత్తుతూంటే<br>
దిశమొలతో నేను<br>
మునకలేసింది అదిగో<br>
ఆ ఒంపులోనే అనుకుంటా<br>
ఒకానొక సాయంకాలం<br>
నేను కట్టిన పిచ్చుకగూళ్ళని<br>
అర్థరాత్రి దొంగలించావు<br>
నేనలిగి నీతో కచ్చి పెట్టుకొని<br>
వెళ్ళిపోయిన రోజే కాదూ<br>
నువ్వు మా యింటి వెనకదాకా<br>
వచ్చావు వరదపొంగులతో<br>
అప్పుడు నీ ముందు నేను<br>
పిన్నీసు గుచ్చిన నిక్కర్లో బచ్చాని<br>
డెబ్భైఏళ్ళ తర్వాత యిన్నాళ్ళకి<br>
నీ ఒడ్డుపైన మళ్ళీ కూర్చున్నా<br>
ఇప్పుడూ నేను తలనెరసిన బచ్చానే!

## శాకాంబరిగా ఇరుకళల పరమేశ్వరీదేవి



నెల్లూరు చెరువు గట్టున వెలసివున్న సింహపురి గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి శాకాంబరి అలంకారాన్ని వైభవంగా నిర్వహించారు. పలు రకాల కూరగాయలు, ఫలాలతో అమ్మవారిని కనువిందుగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎవి శ్రీనివాసులురెడ్డి సారథ్యంలో, అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆ సాయంత్రం అమ్మవారికి వేడుకగా పూలంగిసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

## అల్లూరి కాంస్యవిగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని నెల్లూరు నగరంలో ఏర్పాటుచేయాలని ప్రముఖ సంఘసేవకులు పేరం సుందరరామిరెడ్డి కోరారు. ఈ నెల 5న అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా వర్ధమాన సమాజం మేడపైన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అల్లూరి సీతారామరాజు సేవలను ప్రశంసించారు.

అల్లూరి జయంతిని రాష్ట్ర పర్వదినంగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, ప్రభుత్వ యంత్రాంగం అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సౌజన్యంతో, కీర్తి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో దేశభక్తి గీతాల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు నాగారెడ్డి రాధాకృష్ణారెడ్డి, కీర్తి ఆర్కెస్ట్రా శ్రీనివాసరావుతో పాటు దగ్గుబాటి రాధాకృష్ణ, దుగ్గిరాల బ్రహ్మారెడ్డి, తంగిరాల సుధాకర్, అమరా సుబ్బారావు, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచలకోనలో హుండీ ఆదాయం రూ 48.48లక్షలు

దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 7న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని నృసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు జరిగింది. బ్రహ్మోత్సవాలనంతరం మే నెల 16వతేదీ నుంచి జూలై 7వతేదీ వరకు నృసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవారు, ఆంజనేయస్వామి ఆలయాల్లోని హుండీల్లో లెక్కించగా రూ॥48.48లక్షలు ఆదాయం వచ్చిందని, భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 380గ్రాముల బంగారం, 6,335కిలోల వెండి, శ్రీవారి నిత్యాన్నదానం పథకం ద్వారా రూ॥60వేలు రాబడి వచ్చిందని దేవాదాయశాఖ ఏసీ రవీంద్రరెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ సహాయ కమీషనర్ శనగవరం శ్రీరామమూర్తి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఆలయ ఛైర్మెన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఆలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 11.07.2014 నుండి
తేది. 17.07.2014 వరకు

ఈ వారం మేషంలో కేతువు తులలో రాహువు, 12తేది నుండి కన్యలో రాహువు మీనంలో కేతువు, 12తేది వరకు వృషభంలోను పిదప 13తేది నుండి మిథునంలో శుక్రుడు, మిథునంలో రవి మరియు 16తేది నుండి కర్కాటకంలో రవి, మిథునంలో బుధుడు, కన్యలో కుజుడు మరియు 14 తేది నుండి తులలో కుజుడు, కర్కాటకంలో గురువు, తులలో శని, ధనుర్మకర కుంభమీనరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగము: తేది 12 శనివారం ఆషాఢ పూర్ణిమ వ్యాసపూర్ణిమ.
తేది 11 శుక్రవారం గురుమౌఢ్యమి ప్రారంభము.

ముహూర్తము: ముహూర్తములు లేవు.

**ఆషాఢమాసశుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 11 | శుక్ర | చతుర్దశి | రా॥గం.7.43వ॥ |
| తేది. 12 | శని | పూర్ణిమ | సా॥గం.5.42వ॥ |

**ఆషాఢమాసకృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 13 | ఆది | పాడ్యమి | సా॥గం.3.13వ॥ |
| తేది. 14 | సోమ | విదియ | ప॥గం.12.45వ॥ |
| తేది. 15 | మంగళ | తదియ | ఉ॥గం.10.16వ॥ |
| తేది. 16 | బుధ | చతుర్థి | ఉ॥గం.7.51వ॥ |
| | పిదప | పంచమి | రా॥గం.5.30వ॥ |
| తేది. 17 | గురు | షష్ఠి | రా॥గం.3.21వ॥ |

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో వ్యాపకం ఆదాయం ఉండినా ఆదాయానికిమించిన ఖర్చులుంటాయి. కొత్త పెట్టుబడులకు, కొనుగోలుకు అప్పు చేయవలసిరావచ్చును. అనుకున్న పనులు సరిగా జరుపుకొనలేక టెన్షన్ పడుతుంటారు. ఉద్యోగులు జాగ్రత్తగా విధి నిర్వహణ జరపండి. అధికారులు మరియు పబ్లిక్‌తో సమస్యలుంటాయి. ఆరోగ్యలోపం వలన ఇబ్బందిపడతారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

హడావుడిగా తొందరపాటు నిర్ణయాలు చేయవద్దు. మీ పథకాలు ప్రణాళిక త్వరలో మంచి ఫలితాలనిస్తాయి. అనుకోని ఖర్చులు పైబడి అవసరాలకు ఋణాలు చేసే అవకాశమున్నది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. పలుకుబడితో పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తారు. ఉద్యోగులకు స్థానమార్పులు, అదనపు బాధ్యతలుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగులకు, వ్యాపారులకు అధికారుల వల్ల సమస్యలురాగలవు. వృత్తి వ్యాపారాల నిర్వహణ, రాబడి అసంతృప్తి కలిగిస్తుంది. మంచి ఆర్థికావకాశాలు వాయిదాపడవచ్చును. ప్రయోజనంలేని ప్రయాణ శ్రమ ఉంటుంది. బంధువర్గంతో విభేదాలురాగలవు. ఉద్యోగులకు బాధ్యతలు అదనంగా మోపబడగలవు. అనుకున్న పనులకు అవరోధాలుంటాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

పెరిగిపోయిన ఖర్చులను అదుపుచేసికొనడం, క్రొత్త ప్రణాళికలో వ్యాపారవృత్తులను జరుపుకొంటారు. ఆదాయం సామాన్యం. దూరప్రయాణాలుంటాయి. సంప్రదింపులతో పరిష్కారమార్గం కనిపించి పెండింగ్ వ్యవహారాలు సర్దుబాటు కాగలవు. శుభకార్యములకై ముమ్మర ప్రయత్నాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలు నిర్వహణ సంతృప్తిగా ఉంటుంది. ఆదాయం పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు, నూతన వ్యాపారాల ప్రారంభానికి ప్రయత్నాలు సాగిస్తారు. స్థిరాస్తుల విషయంలో తొందరపాటుగా నిర్ణయాలు చేయవద్దు. ప్రభుత్వ అనుమతులు ఆలస్యంకాగలవు. రియల్ ఎస్టేట్, ట్రాన్స్‌పోర్ట్ రంగాల యజమానులకు అభివృద్ధి ఉంటుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కళత్ర అనారోగ్యము, అధిక ఖర్చులు కారణంగా ఆలోచనలు పెరిగి టెన్షన్ పడతారు. అనుకున్న పనులకు ఆటంకాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో ప్రాబల్యం పెరిగి ఆదాయం పెరుగుతుంది. లౌక్యంగా కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకొంటారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు రుణాల మంజూరు లభిస్తుంది. అగ్రిమెంట్లు, రాబట్టుకొనే బాకీల విషయంలో ఖచ్చితంగా ఉండండి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆదాయము ఖర్చు సమానంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం పెరుగుతుంది. పనులకు ఆటంకాలు కలుగుట వల్ల టెన్షన్‌పడుతారు. వాహనాలు నడిపేటప్పుడు, యంత్రాలు కరెంటు పనులు చేసేవారు మెలకువగా ఉండాలి. స్థిరాస్తులు కొనే ప్రయత్నాలు జరుగుతాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. కుటుంబ సమస్యలుండే వారికి సర్దుబాటుకాగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఈవారం మంచి ఖర్చుపైనబడవచ్చును. వృత్తి వ్యాపారాలలో స్తబ్దత నెలకొంటుంది. ఆదాయవ్యయాలలో తేడా లుంటాయి. ప్రభుత్వ అనుమతులు లభించగలవు. గృహ వస్తువాహనాల రిపేర్లు, వస్తు నష్టముంటుంది. వ్యవహారాలలో ఆటంకాలు, చికాకులుండి పనులు నిదానంగా జరుగుతాయి. ఋణవత్తిడి పెరగవచ్చును. వ్యవసాయ వర్గాల వారికి పరిస్థితులు ఆశాజనకంగా ఉంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక ఒప్పందాలు, చెల్లింపులు, బ్యాంకు లావాదేవీలందు జాగ్రత్త అవసరం. వ్యాపారవృద్ధి అవకాశాలు దొరుకుతాయి. వృత్తి జీవనంలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. ఖర్చులు కొన్ని అదనంగా ఉండినా ఇబ్బంది అనిపించదు. కుటుంబసభ్యుల మధ్య అవగాహన కుదరక ఇబ్బందిపడతారు. అనుకున్న పనులను ఏకాగ్రతతో సాధించుకొంటారు.


## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తులు షేర్ల మీద ఆదాయం బాగుంటుంది. సోదరులు కుటుంబాలకు మేలు జరుగుతుంది. ఆఫీసులలో మీ పనులు అనుకూలంకాగలవు. స్టాకిస్టులు, భాగస్వామ్య వ్యాపారవర్గాలకు ఇబ్బందులుండవచ్చును. ఆత్మీయ బంధువులను కలుసుకుంటారు. కుటుంబ సభ్యుల అనుకూలత ఇంట్లో తక్కువగా ఉంటుంది.


## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆశించిన మేరకు ఆదాయం ఉంటుంది. శ్రమతో పనులు పూర్తి చేస్తారు. శుభకార్యాలు నిర్ణయమగు అవకాశాలున్నాయి. కుటుంబంలో మీ పనులకు కొంత వ్యతిరేకత ఉండినా లెక్కచేయరు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదా వేసుకొనండి. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు దొరుకుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు పుంజుకుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థికంగా స్థిమితపడతారు. కొత్త వ్యాపారాలు, కొత్త పెట్టుబడుల ప్రయత్నాలు సానుకూలంకాగలవు. బంధు మిత్రులను కలుసుకొంటారు. దూరప్రయాణాలుంటాయి. పెండింగ్‌లోనున్న పనులు, ఆఫీసు ఫైల్లలో కదలిక ఉంటుంది. శుభకార్య నిర్ణయాలు జరుగగలవు. విద్యార్థులకు మంచి ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. బంధుమిత్రుల సహాయ సహకారాలు పనులలో లభిస్తుంది.

# రంజాన్ మాసంలో కరెంటు కోతల్ని ఆపండి



వినతిపత్రం సమర్పిస్తున్న యంఐయం నాయకులు

యం.ఐ.యం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రవూఫ్ ఆధ్వర్యంలో ఈనెల 5న 100 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు బైకు ర్యాలీ నిర్వహించి మద్రాస్ బస్టాండు, ఆర్.టి.సి బస్టాండ్ మీదుగా రాజరాజేశ్వరి గుడి వద్ద వున్న ఎలక్ట్రిసిటి కార్యాలయానికి చేరుకొని ఎస్.ఇ నాగశయనరావును కలిసి కరెంటు కోతలకు సమయమంటూ లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు తీస్తున్నారని నిరసన తెలిపి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రవూఫ్ మాట్లాడుతూ కరెంటు కోతలు లేకుండా చేస్తున్నామని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని పవిత్రమైన రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం కనీసం ఎంగిలి కూడా మింగకుండా కఠోర ఉపవాస దీక్ష చేస్తారని అన్నారు. కనీస మానవతా విలువలు లేకుండా కరెంటు కోతలు విధిస్తున్నారని ఉపవాస దీక్ష విరమించే సమయంలో అంటే 6గం॥కు తీసిన కరెంటు 8గం॥లకు ఇస్తున్నారని, ఆ సమయంలో చిన్నారులు, పెద్దలు పడ్డ అవస్థ వర్ణనాతీతమని పేర్కొన్నారు. ప్రార్థన సమయంలో అయితే మసీదుల్లో చాలా అసహనానికి గురయ్యారన్నారు. ప్రశాంతంగా ఉపవాసం వుండి దీక్ష విరమించే సమయంలో కరెంటు లేకుండా పోవటం చాలా బాధాకరమన్నారు. ఇకనైనా ఇటువంటి కోతలు లేకుండా చూడాలని కోరారు. దీనికి స్పందించిన ఎస్.ఇ నాగశయనరావు అలా జరగకుండా చూస్తామన్నారు.

కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి హమీద్ హుస్సేన్, వసీం అహమద్, షఫీ, అమీర్‌జాన్, జాషిద్, మసూద్, షాహిద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆశాజనకంగా లేని రైల్వే బడ్జెట్



కేంద్ర రైల్వేశాఖ మంత్రి సదానందగౌడ్ ఈనెల 8న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్ ఆశించినంత ఆశాజనకంగాలేదని, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రైల్వే వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షులు మరియు ఆంధ్రాఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ సభ్యులు కె.వి.చలమయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్ రాష్ట్రానికి మేలు చేసేదిలా లేదన్నారు. రాష్ట్రం విడిపోయినందున విజయవాడ-న్యూఢిల్లీ ఏపి ఎక్స్‌ప్రెస్, విశాఖ-చెన్నై వీక్లీ ఎక్స్‌ప్రెసను మాత్రమే ప్రవేశపెట్టి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తంచేసారు.

# ఉన్నత చదువులు చదివి మంచిపేరు తెచ్చుకోవాలి

## పోలీసు కుటుంబాల విద్యార్థులకు జిల్లా ఎస్పీ సూచన



ప్రతిభా విద్యార్థులతో జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్

పోలీసు కుటుంబాలకు చెందిన ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదువుకుని సమున్నతంగా ఎదగాలని పోలీసు శాఖకు, పోలీసు కుటుంబాలకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్ ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి మంచి లక్ష్యాలను ఎన్నుకుని లక్ష్యసాధనకు కష్టపడి చదివితే సత్ఫలితాలు సాధించ వచ్చని ఆయన సూచించారు. ఆదివారం జిల్లా పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, టెన్త్, ఇంటర్ లలో మంచి మార్కులు సాధించిన 115 మంది పోలీసు కుటుంబాలవారి పిల్లలకు ఆయన ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా లోని పోలీసుల్లాగానే, వారి కుటుంబాల్లో వారి పిల్లల్లో క్రమశిక్షణ, అంకితభావం వున్నాయని, అందువల్లనే ఇంతమంది విద్యార్థులు మంచిమార్కులు సాధించారని, విద్యార్థులు మంచి మార్కులు సాధించడంలో వారి తల్లి దండ్రుల పాత్ర కూడా ఎంతో వుందని అభినందించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎఎస్పీ రెడ్డి గంగాధరరావు మాట్లాడుతూ, టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఇలా ప్రతిభా పురస్కారాలు అందజేసి ప్రోత్సహించడం మంచి సంప్రదాయమని, ఈ ఘనత రాష్ట్రంలో మన జిల్లా పోలీసు అధికారుల సంఘానికే దక్కిందని ప్రశంసించారు. జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు మాట్లాడుతూ, పోలీసులు విధి నిర్వహణలో క్షణం తీరికలేకుండా ప్రజలకు తమ సేవలు అందిస్తుంటే, వారి పిల్లలు కూడా ఎంతో క్రమశిక్షణతో చదువుతుండడం, అందుకు పోలీసు కుటుంబాల్లోని ఆయా విద్యార్థులు తల్లులు ఎంతో శ్రద్ధ తీసుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, జయరామసుబ్బారెడ్డి, పోలీసు అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి అంజిబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీకుమార్‌రెడ్డి, గౌరవసలహా దారులు మాధవరెడ్డితో పాటు శివప్రకాష్, వహీద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్‌కు, ఎఎస్పీకి, నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి, రూరల్ డిఎస్పీ రాంబాబులకు పోలీసు అధికారుల సంఘం తరఫున జ్ఞాపికలు అందజేశారు.

# వీధి రౌడీల్లా వ్యవహరిస్తే ఎలా?

## ఎస్ఎఫ్ఐ నిరసన

ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు వీధిరౌడీల్లా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనంటూ అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) తీవ్రంగా నిరసన వ్యక్తం చేసింది. ఆదివారం వీఆర్సీ కూడలిలో ఆ మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 5న జడ్పీహాల్‌లో జరిగిన సంఘటనలను, అక్కడ కొందరు రాజకీయ నాయకులు ప్రవర్తించిన తీరు బాధాకరమని, పదవుల కోసం వీధి రౌడీల్లా ప్రవర్తించడం ఎంతో శోచనీయమని వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంవి రమణ, ప్రసాద్, రవి, రాజేష్, నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వై.యస్. ఆశయాల కోసం తపిస్తాం... పేదవారి మనుగడ కోసం శ్రమిస్తాం!

## "నాటా" రెండవ ద్వైవార్షిక సభలో "వై.యస్.ఆర్. ఫౌండేషన్" ఆధ్వర్యంలో వై.యస్. జయంతి వేడుకలు

- డా॥ ప్రేమ్‌రెడ్డి






డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి 65వ జయంతి వేడుకలు జులై 6వ తేదీ ఆదివారం నాడు అమెరికాలోని జార్జియా రాష్ట్రం అట్లాంటా నగరంలో ఘనంగా జరిగాయి. నాటా ద్వైవార్షిక సమావేశాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని అమెరికాలోని వై.యస్.ఆర్. ఫౌండేషన్ నిర్వహించింది. డా॥ వై.యస్.రాజశేఖర రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు ఆళ్ళ రామిరెడ్డి సారధ్యంలో జరిగిన ఈ జయంతి కార్యక్రమానికి డా॥ ప్రేమ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఆర్.టి.సి మాజీ ఛైర్మెన్ గోనె ప్రకాశరావుతో పాటు డా॥ మల్లారెడ్డి, డా॥ స్టాన్లీరెడ్డి, 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, సంస్థ సభ్యుడు గోశాల రాఘవరెడ్డి, జిట్టా సురేంద్రరెడ్డి లతో పాటు పలువురు నాటా ఆర్గనైజింగ్ సభ్యులు వై.యస్.రాజశేఖరరెడ్డి ఫౌండేషన్ నిర్వాహక బృందం పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్ మోహన్‌రెడ్డి వీడియో ద్వారా పంపించిన సందేశాన్ని రెండున్నర నిమిషాల పాటు ప్రదర్శించారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన శోభా నాగిరెడ్డికి నివాళులు అర్పించి రెండు నిముషాలు మౌనం పాటించారు.

సభలో డా॥ ప్రేమ్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల శ్రేయస్సే ఊపిరిగా జీవించిన డా॥ రాజశేఖరరెడ్డి ఆశయ సాధన కోసం పనిచేయడానికి తాను ఎల్లవేళలా సిద్ధంగా వుంటానని, తన సహోద్యోయిగా వై.యస్.ఆర్‌తో తనకున్న అనుభూతులు ఎన్నటికీ మరవలేనని అన్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా జరిగే అన్ని కార్యక్రమా లకు డాలర్ టు డాలర్ మ్యాచింగ్ ద్వారా ఫండ్స్ అందజేసి సంస్థ చేపట్టే అన్ని సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వ హించడానికి తనవంతు చేయూతనిస్తానని చెప్పారు. పేదవారి మనుగడ కోసం వై.యస్. చూపిన మార్గాన్ని పాటించి ఆయన ఆశయసాధనలో తాము ముందు కెళ్తామని చెప్పారు.

ఆర్‌టిసి రాష్ట్ర శాఖ మాజీ ఛైర్మెన్ గోనె ప్రకాశరావు మాట్లాడుతూ నీతి నిజాయితీలకు నిలువెత్తు సాక్ష్యం డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి అన్నారు. తనకు 1973 నుండి వై.యస్.తో అనుబంధం వుందని ఆయనతో పరిచయాన్ని ఎన్ని జన్మలెత్తినా మరువలేనని అన్నారు.

శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ మరణించిన తరువాత సైతం జీవించా లంటే మంచితనం కావాలని, ఆ మంచి తనాన్ని సమాజానికి తెలియజేయాలంటే సేవాతత్వం వుండాలని, ఆ సేవతత్వాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలంటే గొప్ప నాయకత్వం కావాలని, అలాంటి నాయ కత్వపు లక్షణాలున్న డా॥ ప్రేమ్‌సాగర్‌రెడ్డి పర్యవేక్షణలో వారి ఆశీస్సులతో వై.యస్.ఆర్. ఫౌండేషన్ మంచి సేవా సంస్థగా గుర్తింపుని సాధిస్తుందని అన్నారు. వ్యవస్థకన్నా వ్యక్తి గొప్పవాడన్న విషయాన్ని రుజువు చేసిన వ్యక్తిత్వం డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డిదని కొనియాడారు.

గోశాల రాఘవరెడ్డి మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి గారి లాంటి నాయకుడిని బహుశా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మళ్ళీ చూడబోదేమోనని అన్నారు. తమ ఫౌం డేషన్ చేసిన, చేపట్టదలచిన సేవా కార్యక్రమాల వివరాలను ఆళ్ళ రామిరెడ్డి సభకు వివరించారు.

డా॥ వై.యస్. 65వ జన్మదినోత్సవ కేక్‌ని డా॥ ప్రేమ్‌సాగర్‌రెడ్డి కట్ చేశారు. అప్పటికప్పుడే డా॥ వై.యస్. పై పాట వ్రాసి వినిపించాడు సోమవరపు శ్రీని వాసులురెడ్డి. కార్యక్రమ ప్రారంభానికి ముందు శ్రీమతి బాలార్క, మేఘశ్యాం రెడ్డిలు తమ గాత్రం ద్వారా సంగీత విందును అందించారు.

సంస్థ సభ్యులు గంగసాని రాజేశ్వర రెడ్డి, గిరీష్‌రెడ్డి, విష్ణుకుమార్ కోటంరెడ్డి, రమేష్ అప్పారెడ్డి, సురేష్ సడిపిరాళ్ళ, శ్రీకాంత్ గుడిపాటి, జ్యోతి గాదిల, శివ మేక తదితరులతో పాటు వివిధ ప్రాం తాల నుండి విచ్చేసిన వై.యస్.ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## నిదానమా? నిర్లక్ష్యమా?

(మొదటిపేజీ తరువాయి)

మరమ్మత్తులకు 10కోట్లు ఖర్చుపెట్టడం చూస్తుంటే ఇప్పట్లో సీమాంధ్రకు వచ్చే ఉద్దేశ్యం కూడా ఆయనకు లేనట్లు కనిపి స్తుంది. చంద్రబాబు, మంత్రులు హైదరా బాద్‌లోనే ఉండిపోవడంతో సీమాంధ్రలోని 13జిల్లాల్లో పరిస్థితుల్లో ఎటువంటి మార్పు లేదు. విభజన ఉద్యమ సమయంలో ఇక్కడ ఎలాగైతే వ్యాపార వాణిజ్య కార్యక్రమాలు స్థంభించి ఉన్నాయో ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంది. సీమాంధ్ర నుండి పరిపా లన సాగిస్తే అన్ని రకాల వ్యాపారాలు పుంజుకునే అవకాశాలున్నాయి. ముఖ్యంగా సీమాంధ్రలోని పలు జిల్లాల్లో రియల్టర్లు కోలుకునే అవకాశముంది. చంద్రబాబు ఇంకా రెండుకళ్ల సిద్ధాంతం అంటూ సీమాంధ్రతో పాటు, తెలంగాణలోనూ అధికారంలోకి రావాలని కలలు కంటూ సీమాంధ్ర సీఎంగా ఈ ప్రాంతానికి సంపూర్ణ న్యాయం చేయకుండా ఈ ప్రాంత ప్రజల కళ్లు పొడుస్తున్నాడు.

## బజ్జున్నావా...

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టకుండా ఆ పనిని మల్లికార్జున ఖర్గేకు అప్పగించడంతో ఆయన నాయకత్వానికి పనికిరాడనే ప్రచారం వచ్చింది. ఇప్పుడు సభలోనే నిద్రపోవడం చూసి ఈయన ప్రధాని అయ్యుంటే దేశం కూడా ఇలాగే నిద్రపోయి ఉండేదని రాజకీయ విశ్లేషకుల వ్యాఖ్యానం.

## ఎవరు గెలుస్తారో?

(మొదటిపేజీ తరువాయి)

వైకాపా బలం 24 అయితే తెలుగుదేశం బలం 22గా వుంది. తెలుగుదేశంకు ఇంకొకరు వస్తే బలాలు సమమై ఛైర్మెన్ ఎంపికను డ్రా తీయాల్సి ఉంటుంది. అలాకాకుండా ఇద్దరు, అంతకంటే ఎక్కువ వస్తే ఛైర్మెన్ పీఠం తెలుగుదేశం వశమవుతుంది. ఇప్పుడున్న బలాల ప్రకారం చేతులెత్తితే ఛైర్మెన్ సీటు వైకాపాదే అవుతుంది. రెండు పార్టీలు కూడా తమ క్యాంపుల్లో వున్న వారిని భద్రపరచుకుంటున్నాయి. తెలుగుదేశం వాళ్లు మాత్రం కనీసం ఇంకో నలుగురినన్నా లాగే ప్రయత్నాలలో ఉన్నారు. వైకాపా నాయకులు కూడా తమ సభ్యులలో ఇద్దరు లేదా ముగ్గురు చేజారే అవకాశముందని, ఓటింగ్ సమయంలో వాళ్లు తెలుగుదేశంకు అనుకూలంగా వ్యవహరించే అవకాశముందని అనుమానిస్తున్నారు. మొన్న ఎన్నిక వాయిదా పడడమే వైకాపాకు శాపం కాగా తెలుగుదేశంకు వరంగా మారింది. జడ్పీ ఛైర్మెన్ కుర్చీని లాగేసుకోవడానికి ఇంకో అవకాశమిచ్చినట్లయ్యింది.



ఇటీవల నెల్లూరులో నిర్వహించిన ఫర్నీచర్ ఎక్స్ఛేంజ్ మేళాలో వచ్చిన ఫర్నీచర్‌ను విశాలాక్షి వృద్ధుల ఆశ్రమానికి వితరణ చేస్తున్న అమ్మ ఫర్నీచర్ మాల్ నిర్వాహకులు గడ్డం సుధాకర్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, సుజన్‌రెడ్డి

## ఎస్పీ శైలజకు 'కళాంజలి' పురస్కారం



నెల్లూరులోని ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'కళాంజలి' ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేది సాయంత్రం 6.30 గంటలకు నెల్లూరు, టౌన్‌హాలులో ప్రముఖ సినీ నేపథ్యగాయని శ్రీమతి ఎస్పి శైలజకు 'కళాంజలి' ఆత్మీయ పురస్కారం వుంటుం దని ఆ సంస్థ వ్యవస్థాపకులు కళాంజలి అనంత్ తెలియజేశారు. ప్రముఖ సినీ రచయిత వెన్నెలకంటి అధ్యక్షతన జరగ నున్న ఈ కార్యక్రమంలో 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివ ప్రభాత్‌రెడ్డి జ్యోతి ప్రకాశనం చేస్తారని తెలిపారు. ముఖ్యఅతిథులుగా స్వర్ణభారత్ ట్రస్ట్ దీపా వెంకట్, కళాంజలి గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు తది తరులు పాల్గొంటారని, ఈ సందర్భంగా అనూష, శివకుమార్, హంసిని, జ్ఞానశ్రీ, కృష్ణయ్య, మధుబాబు, రాజ్యలక్ష్మిలచే సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహిస్తా మని పేర్కొన్నారు.

***సినీ పాటల పోటీలు:*** ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల దాకా సినీపాటల పోటీలు నిర్వహిస్తామని, 12ఏళ్ళ లోపు వారిని జూనియర్లుగా, ఆపై వారిని సీనియర్లుగా పరిగణించి, ఆయా విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు, ప్రత్యేక బహుమతులు అందజేస్తామని తెలిపారు. విజేతలకు అదేరోజు సాయంత్రం జరిగే కళాంజలి ఆత్మీయ పురస్కారం కార్యక్ర మంలో బహుమతులు అందజేస్తామని వివరించారు. వివరాలకు కళాంజలి అనంత్, ఫోన్ నెం.9848959575ను సంప్రదించాలని ఆయన కోరారు.

## తిరుమలేశుని దర్శనానికి... మరిన్ని ఏర్పాట్లకు టిటిడి ఆలోచనలు

- వాకాటి విజయకుమార్‌రెడ్డి హర్షం

ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి నిత్యం వేలాదిగా పోటెత్తివస్తున్న భక్తులకు శ్రీవారి దర్శనంలో కలుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు, గంటల తరబడి క్యూలలో వేచి వుండకుండా వీలైనంత శ్రీఘ్రగతిన స్వామివారి దర్శనభాగ్యం కల్పించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు, రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు తగు చర్యలు తీసుకునేందుకు సంకల్పించడం ఎంతైనా హర్షదాయకమని టిటిడి ధార్మిక సలహామండలి సభ్యులు, స్థానిక మాదరన్ స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్వామివారి దివ్యదర్శనం టోకన్లు కలిగిన భక్తులకు స్వామివారి దర్శనం 15 గంటలు కూడా పడుతుండడం, దీంతో భక్తులు ఇబ్బందులు పడుతుండడంతో ఆ సమయాన్ని తగ్గిస్తూ, కేవలం గంట, లేదా రెండు గంటల ముందుగా భక్తులు ఆయా కంపార్ట్‌మెంట్లలోకి ప్రవేశించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం ముదావహమన్నారు. అదేవిధంగా, ప్రత్యేక దర్శనానికి వారంరోజులు ముందుగా 10వేల టిక్కెట్లు, నాలుగురోజులు ముందుగా 5వేల టిక్కెట్లు, ఒకరోజు ముందుగా 3వేల టిక్కెట్లు ప్రతి దినం ఇచ్చేందుకు టిటిడి నిర్ణయించడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు.

గతంలో తాను టిటిడి ధార్మిక సలహామండలి సభ్యునిగా వున్నప్పుడు కూడా భక్తుల సౌకర్యార్ధం పలు సూచనలు చేశామన్నారు. శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులందరికీ నిర్ణీత తేదీ, సమయంతో రెండునెలల ముందుగానే రిజర్వేషన్ సౌకర్యం అన్ని ప్రాంతాల్లోనూ కల్పించవచ్చని, స్వామివారి దర్శనసేవలన్నిటికీ ఇలాంటి సౌకర్యం కల్పించవచ్చని ఆయన సూచించారు. అదేవిధంగా, ఉచిత దర్శనానికి వెళ్ళే భక్తులకు కూడా నిర్ణీత సమయం కేటాయించి శ్రీవారి దర్శనభాగ్యం కల్పించేందుకు కూడా చర్యలు తీసుకోవచ్చని ఆయన సూచించారు. భక్తులను కేవలం రెండు క్యూలైన్లలో మాత్రమే అనుమతించి, తోపులాటకు తావివ్వకుండా వాలంటీర్లను నియమించి ఇబ్బందిలేకుండా భక్తులకు దర్శన ఏర్పాట్లు చేయవచ్చని, శ్రీవారి దర్శనానికి కేటా యించిన నిర్ణీత సమయానికి ఎక్కువ వ్యవధి వున్నవారికి స్థానికంగా వుండే ఇతర దేవాలయాలను సందర్శించేందుకు, సంప్రదాయ ప్రదర్శనలు తిలకించేందుకు అవకాశం కల్పించవచ్చని ఆయన సూచించినట్లు తెలిపారు.

అదేవిధంగా తిరుపతిలోని ఆలయాల సందర్శనకు బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేస్తే భక్తులకు సౌకర్యవంతంగా వుంటుందని కూడా సూచించినట్లు తెలిపారు. ఏదేమైనా, ముఖ్యమంత్రి సూచనలతో టిటిడివారు శ్రీవారి భక్తులకు స్వామిదర్శనభాగ్యం వీలైనంత శ్రీఘ్రగతిన లభించేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించుకోవడం తనకెంతో సంతోషంగా వుందని ఆయన పేర్కొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## గూడూరు పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దండి

### చైర్‌పర్సన్‌కు బీసీ యువజన సంఘం వినతి




చైర్‌పర్సన్ దేవసేనను అభినందిస్తున్న బీసీ యువజన సంఘం నాయకులు

గూడూరు పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది జిల్లాకే ఆదర్శంగా నిలవాలని బీసీ యువజన సంఘం, బీసీ విద్యార్థి సంఘ నాయకులు గూడూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనను కోరారు. ఈమేరకు 5వ తేదీ ఆమెకు వినతిపత్రం అందజేశారు. బీసీ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. పట్టణంలో ప్రధానంగా పారిశుద్ధ్యం, మంచినీటి వసతులు కల్పించాలని కోరారు. బీసీ సంఘ అధికార ప్రతినిధి కోట పవన్‌కుమార్, ఉడతా శశిధర్‌యాదవ్, పోలయ్య, ధన తదితరులు చైర్‌పర్సన్‌ను కలిసి విన్నవించారు.

## బలిజలు బీసీ రిజర్వేషన్ సాధించుకోవాలి

- చదలవాడ హరిప్రసాద్‌నాయుడు



ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న బలిజ సంఘం నాయకులు

బీసీ రిజర్వేషన్‌ను బలిజలు సాధించుకోవాలని బలిజ అభ్యుదయ సంక్షేమసంఘం, కాపునాడు గౌరవాధ్యక్షుడు చదలవాడ హరిప్రసాద్‌నాయుడు అన్నారు. స్థానిక రోటరీ భవన్‌లో ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు వాటంబేడు శివకుమార్, నిమ్మకాయల కృష్ణకుమారి, చిట్టమూరు ఎంపిపి ఉక్కు జనార్ధన్‌లను సోమవారం బలిజసంఘం సన్మానించింది. ఈ సందర్భంగా చదలవాడ హరిప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో బలిజలకు గుర్తింపు ఉందన్నారు. అందుకనుగుణంగా బీసీ రిజర్వేషన్ల సాధనకు ఇప్పటికే శ్రీకారం చుట్టారన్నారు. ప్రజాప్రతినిధులంతా ఐకమత్యంగా బలిజ కులస్థులతో పాటు అన్నివర్గాల ప్రజలకు సేవలందించి గుర్తింపు పొందాలన్నారు. సన్మానగ్రహీతలు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంతో పాటు రిజర్వేషన్ల సాధనకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాపునాడు నాయకులు తేలపల్లి రాఘవయ్య, చాట్ల నరసింహారావు, కాపునాడు జిల్లా అధ్యక్షుడు గిరి, మధుసూదనరావు, బాబురావు, చదలవాడ విజయభాస్కర్‌నాయుడు, సారంగం సులక్ష్మి, శీలం శశికళ, ఎం.వి.రమణయ్య, లక్ష్మీనారాయణ, పెద్దశెట్టి ప్రభాకర్, పడిమాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ విస్తృతసేవలు



క్లబ్ నూతన అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరిస్తున్న మైథిలి

గూడూరు రోటరీక్లబ్ సేవలను మరింత విస్తరిస్తామని క్లబ్ నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన పి.రఘురామిరెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని కోనేటిమిట్ట లోని ద్వారకామయి ఫంక్షన్ హాల్‌లో ఇటీవల క్లబ్ నూతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. రోటరీ హెల్పేజ్ పథకం ద్వారా వృద్ధులకు ప్రతి నెలా సరకులు అందజేస్తున్నామని, ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. వికలాంగులకు పరికరాల పంపిణీ నిమిత్తం క్లబ్ తమవంతు సేవలను అందిస్తోందన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ నూతన అధ్యక్షురాలిగా మైథిలి, కార్యదర్శిగా లక్ష్మిని ఎంపిక చేశారు. అధ్యక్షురాలు మైథిలి మాట్లాడుతూ మహిళల సమస్యలపై నిత్యం పోరాటం సాగిస్తామని తెలిపారు. వివిధ క్లబ్‌ల ప్రతినిధులు గోపాల్‌రావు, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మయూరి శ్యాంయాదవ్, కె.మునిగిరీష్, దశరథరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మంజుల, బొమ్మిడి శ్రీనివాసులు, మంజులాదేవి, డాక్టర్ సి.రోహిణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పురపాలక సమావేశ మందిరానికి

## సొంత నిధులు సమకూరుస్తా

పొనకా శివకుమార్‌రెడ్డి



గూడూరు పురపాలక సంఘం సమావేశ మందిరానికి మరమ్మతులు చేపట్టి కొత్తహంగులు సమకూర్చాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన భర్త, తెలుగుదేశం పార్టీ నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి మున్సిపల్ అధికారులను కోరారు.

ఈ నెల 5న ఆయన చైర్‌పర్సన్ ఉండే గదిని పరిశీలించి మరమ్మతులకు ఎంత ఖర్చు అవుతుందని మున్సిపల్ ఏఇ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. రూ.4.5లక్షలు అవుతుందని ఏఇ చెప్పడంతో తన సొంత నిధులు రూ.5లక్షలు ఇస్తానని, ఆ నిధులతో ఈ సమావేశ మందిరానికి సీలింగ్, సభ్యులకు కుర్చీలు, బల్లలు, కిటికీలు, ఫ్లోరింగ్, మందిరం ఎదురుగా గేటుకు మరమ్మతులు చేపట్టి ముందు పచ్చనిచెట్లు నాటాలని సూచించారు. తాను ఒక సాధారణ పౌరుడిగా కార్యాలయానికి వచ్చానని, నిధులు తానే ఇస్తానని తెలిపారు.

## ఘనంగా గరుడోత్సవం

గూడూరు ఒకటవ పట్టణంలోని కటక రాజవీధిలోని శ్రీ రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగ విఠలనాథస్వామి వారి గరుడోత్సవాన్ని 7వ తేదీ ఘనంగా నిర్వహించారు.

స్వామివారి కల్యాణ రథోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామివారి కల్యాణము కనుల పండుగగా జరిగింది. గజవాహనంపై స్వామి వారిని ఊరేగించారు. అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీపాండురంగస్వామి వారి కల్యాణ మహోత్సవం ఉభయ కర్తలుగా ఉప్పాల వాసు - వరలక్ష్మి, కోట మస్తానయ్య - సరస్వతమ్మ, నీలం రాజారెడ్డి - అనసూయమ్మ, గజవాహనము, గ్రామోత్సవం ఉభయకర్తలుగా ముప్పాళ్ళ సుబ్రహ్మణ్యం రాజు, పురంధర్‌రాజు, భాస్కర్‌రాజు, పాండురంగరాజులు వ్యవహరించారు.

## రెవెన్యూ ఉద్యోగుల నిరసన

గూడూరు ఆర్డీవో కార్యాలయం వద్ద 7వ తేదీ రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కలెక్టర్‌పై అనుచితంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. విధి నిర్వహణలో ఉన్న అధికారి పట్ల దురుసుగా ప్రవర్తించినందుకు నిరసనగా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గూడూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లురెడ్డి, గీతావాణి, గిద్దలూరు రమణయ్య, అశోక్, రాధాకృష్ణ పాల్గొన్నారు.



గూడూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పొనకా దేవసేనకు ధృవపత్రమిస్తున్న ఎన్నికల అధికారి, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ప్రక్కన మున్సిపల్ కమీషనర్ అనురాధ

## మండల అధ్యక్షపీఠం వైకాపా వశం



సభ్యులకు అభినందనలు తెలుపుతున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు మండల అధ్యక్షపీఠాన్ని వైకాపా కైవసం చేసుకుంది. 4వ తేదీ స్థానిక మండల కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి గిరినాథ్, ఎంపిడీవో నిర్మలాదేవి ఆధ్వర్యంలో మండల అధ్యక్షపదవికి ఎన్నికలు నిర్వహించారు. ముందుగా కో-ఆప్షన్ సభ్యుని ఎన్నికకు ఉదయం నామినేషన్లు స్వీకరించారు. మండలంలోని 16 ఎంపీటీసీల సభ్యులచే ప్రమాణం చేయించారు. అనంతరం మూడు గంటల ప్రాంతంలో ఎంపీపీ ఎన్నికను నిర్వహించారు. వైకాపా తరపున పిట్టి రావమ్మను ఎంపీపీ అభ్యర్థిగా కొమ్మనేటూరుకు చెందిన బత్తల పెంచలరావు ప్రతిపాదించగా, చెన్నూరుకు చెందిన మట్టం శ్రావణి బలపరిచారు. తెలుగుదేశం పార్టీ తరపున చెన్నూరుకు చెందిన మదిర శంకరమ్మ పేరును అదే గ్రామానికి చెందిన తూమాటి చిరంజీవి ప్రతిపాదించగా వెందోడు ఎంపీటీసీ బుజ్జా భాస్కర్ బలపరిచారు. వైకాపా అభ్యర్థి పిట్టి రావమ్మకు 9మంది ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తి మద్దతు ప్రకటించారు. తెలుగుదేశంపార్టీ అభ్యర్థి శంకరమ్మకు ఏడుగురు మాత్రమే మద్దతు తెలిపారు. దీంతో వైకాపా అభ్యర్థి పిట్టి రావమ్మ ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. తర్వాత మండల ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికలో మట్టం శ్రావణి గెలుపొందారు. అధికారులు ధృవీకరణ పత్రాలను అందజేశారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఎంపీపీ ఎన్నిక పూర్తయ్యే వరకు సమావేశ మందిరంలోనే ఉన్నారు.



గూడూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లురెడ్డికి రైతు రుణమాఫీ, పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఐ నాయకులు మండ్ల రాజేష్‌కుమార్, ఏఐటీయుసి నాయకులు


**అభినందనలు**



మాకు అత్యంత ఆప్తులు
శ్రీమతి **పొనకా దేవసేన** గారు
గూడూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా
ఎన్నికైన శుభసందర్భంగా మరియు
వైస్‌ఛైర్మెన్‌గా ఎన్నికైన
**శీలం కిరణ్‌కుమార్** గారికి
నా హృదయపూర్వక అభినందనలు.

గూడూరును అన్ని రంగాల్లో
అభివృద్ధిపథంలో నడపాలని కోరుకుంటూ...



మీ...
**చేశెట్టి మోహన్ వంశీకృష్ణ**, B.E., MBA
**CVG PIPES, గూడూరు.**

## మనమంతా ఏకమౌదాం...

# నవ నెల్లూరును సాధిద్దాం!

**నెల్లూరు యన్.ఆర్.ఐ మీట్‌లో పలువురు నెల్లూరీయుల ప్రతిజ్ఞ**

***నవ నెల్లూరు సాధనలో మనమంతా ఏకమౌదాం అంటూ ఖండాంతరాలు దాటి జీవిస్తున్న నెల్లూరీయులంతా ఏక కంఠంతో ప్రతినబూనిన సంఘటన అమెరికాలో జరిగింది. జూలై 6వ తేదీ ఆదివారం సాయంత్రం 4గంటలకు జార్జియా రాష్ట్రంలోని అట్లాంటా నగరంలో "నాటా" ద్వితీయ ద్వైవార్షికోత్సవం సందర్భంగా జరిగిన నెల్లూరు యన్.ఆర్.ఐల సమావేశం జరిగింది.***




ఈ సమావేశానికి భారతదేశాన్నుండి వచ్చిన నెల్లూరీయులు శ్రీహరిరెడ్డి, చెన్నారెడ్డి రవీంద్రరెడ్డి, 'లాయర్' సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డిలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. ముందుగా కృష్ణపాటి రమణారెడ్డి సభకు స్వాగతం పలుకగా చిల్లకూరు గోపిరెడ్డి స్వాగతోపన్యాసం చేశాడు. గోపి మాట్లాడుతూ నెల్లూరు అభివృద్ధిలో యన్.ఆర్.ఐలు కీలకం కావలసిన సమయం ఆసన్నమయిందని, నెల్లూరీయులు ఎక్కడున్నా ఏకతాటిగా జిల్లా అభివృద్ధికి సహకరించాలని అన్నారు. విక్రమసింహపురి యూనివర్శిటీ అడ్వయిజరీ బోర్డు సభ్యుడిగా డా॥ ప్రేమ్‌సాగర్‌రెడ్డి గారిని నెల్లూరు యన్.ఆర్.ఐలకు ప్రతినిధిగా ప్రతిపాదించామని త్వరలోనే ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చబోతుందని అన్నారు.

కార్యక్రమాన్ని నిర్వహించిన మరో నెల్లూరీయుడు సురేష్ మండువ మాట్లాడుతూ ఇలా నెల్లూరీయులంతా అప్పుడప్పుడూ ఒక్క చోటకు చేరితే జిల్లా అభివృద్ధి కోసం చేయాల్సిన పనులపై ఒక అవగాహన వస్తుందని ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన సీమాంధ్రలో నెల్లూరు పాత్ర ప్రముఖంగా వుండాలంటే ఏం చేయాలో సలహాలు సూచనలు చేయవలసిందిగా సభలో వున్నవారికి విజ్ఞప్తి చేశాడు.

శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక కారిడార్‌గా ఇప్పటికే చెన్నై, బెంగుళూరులను అనుసంధానం చేస్తూ నెల్లూరుజిల్లాని ప్రకటించారని ఈ పథకం కార్యరూపం దాలిస్తే నెల్లూరుకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, ముఖ్యంగా మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవలసిన అవసరం వుందని అన్నారు.

శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని 5విభాగాలుగా విభజించి అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో కొత్త ప్రభుత్వం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం వుందని, ఇందులో భాగంగా నెల్లూరును పారిశ్రామిక హబ్‌గా మార్చే ఆలోచనతో పాటు స్మార్ట్ సిటీ ప్రాజెక్టులలో కూడా నెల్లూరుకు స్థానం కల్పించబోతున్నట్లు తెలిసిందన్నారు. ఒక్క నెల్లూరుజిల్లా నుండే సుమారు 11వేల మంది వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నారని, వీరిలో 9వేల మందికి పైగానే అమెరికాలో వుంటున్నట్లు తెలిసిందన్నారు. వీలయినంత ఎక్కువశాతం మంది నెల్లూరీయుల సమాచారాన్ని సేకరించి వీరినంతా వీలయితే నెల్లూరులోనే ఒక చోటకు చేర్చి నెల్లూరు అభివృద్ధిపై ఒక చర్చా వేదికను నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు.

చెన్నారెడ్డి రవీంద్రరెడ్డి మాట్లాడుతూ అనేక మంది యన్.ఆర్.ఐలు సమాజసేవ కార్యక్రమాలను నిర్వహించడానికి సిద్ధంగా వున్నారని, వారి వారి స్వగ్రామాలలో వారి తరపున నిజాయితీగా పనిచేసేవారు కరువైనందునే వారు చేయదలుచుకున్నది చేయలేక పోతున్నారని అన్నారు. వారికి అవగాహన కల్పించి వారిచ్చే విరాళాన్ని సక్రమరీతిలో ఖర్చు చేయగలిగితే అనేక గ్రామాలలో మంచి పాఠశాలలు, దేవాలయాలూ తయారవడంతో పాటు మంచి నీటి ఎద్దడి నివారణకు సైతం మార్గం కనిపిస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరీయులు కోర్పపాటి శ్రీధర్‌రెడ్డి, విష్ణుకుమార్ కోటంరెడ్డి, నరసింహారెడ్డి ఉర్మిడి, గోశాల రాఘవరెడ్డి, బస్విరెడ్డి, డా॥మోహన్ రెడ్డి, డా॥ జగన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, కోదండ రామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, డా॥ విజయ అప్పారెడ్డి, విజయ్‌రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. చంద్రగిరి శాసనసభ్యుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చివరిలో కార్యక్రమానికి విచ్చేసి నెల్లూరీయులతో తనకున్న అనుబంధాన్ని అందరితో పంచుకున్నారు. నెల్లూరీయులంతా ఒక చోట చేరిన ఆత్మీయ కార్యక్రమంలా ఈ మీట్ జరిగింది.






Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.